

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 02 మే 2021 సంపుటి : 02 సంచిక : 292 పేజీలు : 4 వెల : రూ 3-00

## మంత్రాలయం గ్రామంలో హైపో ద్రావణం పిచికారీ

మంత్రాలయం మంత్రాలయం రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు మంత్రాలయం గ్రామంలో సర్పంచ్ తెల్ల బండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి గ్రామంలో హైపో

ద్రావణం పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ భీమయ్య ఉపసర్పంచ్ హోటల్ పరమేష్ మాట్లాడుతూ కరోనా తీవ్రత అధికంగా ఉండటం వల్ల గ్రామంలోని వీధుల్లో హైపో ద్రావణాన్ని పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# కర్నూలు పట్టణంలో తీవ్ర విషాదం



కర్నూలు,మే1 కర్నూల్ జిల్లా కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. అనుమతి లేకుండానే కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. అయితే ఆ చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురు ఆక్సిజన్ అందక మృతి చెందారు. ఈ సంఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు కర్నూలు కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. కొవిడ్‌తో ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆక్సిజన్ అందక వీరు ప్రాణాలు కోల్పోయారు. పట్టణంలో కేఎస్ కేర్ దవాఖానలో ఈ ఘటన జరిగింది. ఘటనను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఘటనపై వెంటనే విచారణ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వీరపాండియన్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. కొన్ని దవాఖానలు అనుమతి లేకుండానే కరోనా చికిత్స చేస్తున్నాయని, ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన అన్నారు. నలుగురు ఆక్సిజన్ అందకే చనిపోయారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలులోని కేఎస్ కేర్ ఆస్పత్రిలో కరోనా చికిత్సకు అనుమతి లేదు.

### ప్రైవేట్ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక ఐదుగురు మృతి విచారణకు ఆదేశించిన కలెక్టర్..మిగతా రోగుల తరలింపు

అయినా కూడా నిబంధనలకు విరుద్ధంగా కరోనా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆక్సిజన్ అందక ఐదుగురు మృతి చెందారు. అనుమతి లేకుండానే కోవిడ్ చికిత్స చేస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. కేఎస్ కేర్ ఆస్పత్రిలో కోవిడ్ వైద్యానికి అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఘటనపై డీఎంహెచ్ఓ విచారణ చేస్తున్నారు. కోవిడ్ ఆస్పత్రిగా నోటిఫైడ్ చేయని కేఎస్కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో కరోనా బాధితులు ఆక్సిజన్ అందక చనిపోయారనితెలుసుకుని డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య విచారణ మొదలు పెట్టారు. కలెక్టర్ వీరపాండియన్ ఆదేశాల మేరకు అధికారులు ఆస్పత్రికి వెళ్లారు. కేఎస్‌కేర్ ఆస్పత్రిలో ఉన్న బాధితులందరినీ అంబులెన్స్‌లో కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. అనుమతి లేకుండా కోవిడ్ పేషెంట్స్‌ను అడ్మిట్ చేసుకుని అనధికారికంగా ట్రీట్మెంట్ ఇచ్చిన ఆస్పత్రి యజమాన్యంపై క్రిమినల్ కేసు బుక్ చేశారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ వీరపాండియన్ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా ప్రభుత్వం అనుమతి లేకుండా అనధికారికంగా కోవిడ్ ఆస్పత్రులు లేదా కోవిడ్ కేర్ సెంటర్స్ నడిపితే క్రిమినల్ కేస్ పెడతాం... సీజ్ చేయిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

## ప్రపంచంలో తొలిసారి..
# భారత్‌లో ఒకేరోజు 4 లక్షల కరోనా కేసులు



న్యూఢిల్లీ: దేశంలో కరోనా విళయతాండవం చేస్తున్నది. వైరస్ విజృంభణతో ప్రతిరోజు పాజటివ్ కేసులు భారీసంఖ్యలో నమోదవుతున్నాయి. దీంతో గత 24 గంటల్లో కరోనా కేసులు 4 లక్షలు దాటాయి. ఒక్కరోజులో 4 లక్షలకుపైగా కేసులు నమోదవడం ప్రపంచంలో ఇదే తొలిసారి. అదేవిధంగా వరుసగా నాలుగోరోజూ మూడు వేలకు పైగా మరణాలు సంభవించాయి. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో కొత్తగా 4,01,993 మంది కరోనా పాజిటివ్‌లుగా నిర్ధారణ అయ్యారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 1,91,64,969కు చేరింది. ఇందులో 1,56,84,406 మంది బాధితులు కరోనా నుంచి కోలుకోగా, 2,11,853 మంది మరణించారు. మరో 32,68,710 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కొత్తగా 2,99,988 మంది డిశ్చార్జీ అయ్యారని, కరోనాతో 3523 మంది మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇప్పటివరకు 15,49,89,635 మందికి వ్యాక్సిన్ పంపిణీ చేశామని తెలిపింది. కొత్తగా నమోదైన కేసుల్లో మహారాష్ట్రలో అత్యధికంగా 62,919 కేసులు, కర్ణాటకలో 48,296, కేరళలో 37,199 చొప్పున నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే మహారాష్ట్రలో కరోనాతో 828 మంది మరణించగా, ఢిల్లీలో 375 మంది, ఉత్తరప్రదేశ్‌లో 332 మంది మృతిచెందారు. దేశవ్యాప్తంగా నిన్న ఒక్కరోజే 19,45,299 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్మార్) ప్రకటించింది. దీంతో ఏప్రిల్ 30 నాటికి 28,83,37,385 నమూనాలను పరీక్షించామని వెల్లడించింది.

## ఏపీలో లాక్‌డౌన్..
# సజ్జల కీలక వ్యాఖ్యలు



తాడేపల్లి: కరోనా సెకండ్ వేవ్ చాలా ప్రమాదకరంగా ఉంది.. కానీ లాక్‌డౌన్ పెడితే రాష్ట్రం మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది అన్నారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."కరోనా కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రజలు వ్యాక్సిన్ వేయించుకున్నా.. జాగ్రత్తలు పాటించాలి. కరోనా నియంత్రణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోజు సమీక్షలు నిర్వహిస్తున్నారువవ అని సజ్జల తెలిపారు. "ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం జగన్ పాలన చేస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. ఇతర రా(ష్టాలకు ఆదర్శంగా నిలిచేలా సీఎం జగన్ పాలన ఉంది. మా పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉంది. ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయం బాధ్యతాయుతంగా ఉంటుందివవ అన్నారు. ఇక ప్రతిపక్ష నేత చంద్రబాబుపై నిప్పులు చెరిగారు సజ్జల. "చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారు.. హైదరాబాద్‌లో కూర్చుని ప్రజలకు భయాందోళనలకు గురి చేస్తున్నారు. సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి అని సజ్జల సూచించారు.

# నేటి తిరుపతి కౌంటింగ్‌కు భారీగా ఏర్పాట్లు

### పోలీస్ బందోబస్తు మధ్య పక్కాగా కౌంటింగ్
### పోలింగ్ తీరుతో మారిన పార్టీల అంచనాలు

తిరుపతి,మే1: తిరుపతి ఉప ఎన్నిక కౌంటింగ్‌కు రంగం సిద్ధం అయ్యింది. ఆదివారం ఉదయం నుంచి జరిగే కౌంటింగ్‌కు భారీగా ఏర్పాట్లు చేశారు. భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటిం కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బలగాలను మొహరించారు. ఎలాంటి అవాంఛీనయ ఘటనలు జరక్కుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక ప్రచారంలో జనం స్పందన చూసి గెలుపు తమదేనని విశ్వసించిన టీడీపీ వర్గాలు సైతం దొంగ ఓట్ల ధాటికి బెంబేలెత్తిపోయాయి. హైకోర్టుపై పెట్టుకున్న ఆశలు కూడా నెరవేరకపోవడంతో ఫలితాల్లో తమకు ఓటమి తప్పదన్నట్టుగా నైరాశ్యంతో వుంటున్నారు. కాకపోతే వైసీపీకి భారీ మెజారిటీ రాదన్న అంచనాలు వారికి ఎంతోకొంత ఊరటనిస్తున్నాయి. ఇంచుమించు బీజేపీ వర్గాలదీ అదే పరిస్థితి. కేంద్రంలో అధికారంలో వున్నందున ఈసీ తమ మొర ఆలకిస్తుందని తొలుత భావించారు. అది నెరవేరకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అక్కడా ఫలితం లేకపోవడంతో వైసీపీ ఎన్నికల అక్రమాలపై తాము పోరాడిన తీరును జనం గమనించారని,దాంతో నైతికంగా తమకే విజయం దక్కిందన్న భావనకు లోనవుతున్నారు. ఉప ఎన్నికలపై తొలినుంచీ ప్రధాన పార్టీలు వేసుకున్న అంచనాలన్నీ పోలింగ్ తీరుతో మారిపోయాయి. పోలింగ్‌కు ముందు వైసీపీ మంత్రులు, ముఖ్యనేతలంతా 5 లక్షల మెజారిటీ సాధిస్తామని ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. టీడీపీ నేతలైతే చంద్రబాబు, లోకేశ్ పర్యటనలకు లభించిన స్పందన చూసి తమ అభ్యర్థి గెలుస్తారనే నమ్మకానికి వచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వున్న వ్యతిరేకత ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా కనిపించిందన్న అభిప్రాయానికి వచ్చారు. ఇక బీజేపీ నేతలు వైసీపీని లక్ష్యంగా చేసుకుని మతపరమైన అంశాలను ప్రచారాస్త్రాలుగా మలుచుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో పార్టీ ప్రభావం చూపుతుందని విశ్వసించారు. అయితే పోలింగ్ రోజు పరిస్థితి అందరి అంచనాలనూ తారుమారు చేసింది. అధికార పార్టీ నేతలు ఇతర నియోజకవర్గాల నుంచీ వందలాది వాహనాలు ఏర్పాటు చేసి వేలాదిమందిని తిరుపతికి తరలించి వారితో దొంగ ఓట్లు వేయించారు. దీన్ని టీడీపీ, బీజేపీ తదితర ప్రతిపక్ష నేతలు ఎంతమాత్రం అడ్డుకోలేకపో యాయి. వారి ఫిర్యాదులపై అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం కూడా స్పందించలేదు. పోలింగ్ రోజు పరిణామాలతో వైసీపీ వర్గాలు ఆత్మరక్షణలో పడిపోయాయి. ఓడిపోతామన్న ఖచ్చితమైన సమాచారం వుండబట్టే దానికి విరుగుడుగా భారీ ఎత్తున దొంగ ఓట్లు వేయించారన్న ప్రచారం మొదలైంది.

# 'భారత్‌లో లాక్‌డౌన్ పెట్టండి..!

వాషింగ్టన్: భారత్‌లో కరోనా పంజా విసురుతోంది. కరోనా వైరస్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయి. తొలిసారిగా ఒక్కరోజే రికార్డు స్థాయిలో 4 లక్షల కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా చీఫ్ మెడికల్ సలహాదారు డాక్టర్ ఆంటోనీ ఫాచీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో కచ్చితంగా కొన్నిరోజుల పాటు లాక్‌డౌన్‌ను విధించాలని సూచించారు.



లాక్‌డౌన్ విధింపుతో కొంతమేరకు కరోనా కేసుల సంఖ్యను తగ్గించవచ్చునని తెలిపారు. అంతేకాకుంగా కరోనా వైరస్ వ్యాపిని కొంతమేరకు అదుపు చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. భారత ప్రభుత్వం లాక్‌డౌన్‌ను ఆరు నెలలపాటూ విధిస్తే ఆర్థికంగా ఇబ్బందిపడుతుందని తెలపగా, దేశంలో కొన్ని వారాల పాటు లాక్‌డౌన్‌ను విధిస్తే వైరస్ వ్యాప్తి నుంచి కొంతమేరకు ఉపశమనం కల్గవచ్చునని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం కరోనాపై విజయం సాధించమని ముందే భావించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. భారత్‌లో ప్రస్తుతం తీవ్రంగా ఆక్సిజన్ కొరత ఉందని తెలిపారు. భారత్‌లోని ప్రజలు ఆక్సిజన్ కోసం ఆపసోపాలు పడుతున్నారని పేర్కొన్నారు. కరోనా వైరస్‌ను అదుపు చేయడంలో వ్యాక్సిన్ కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. 130 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత్‌లో ఇప్పటివరకు కేవలం 2 శాతం జనాభాకు మాత్రమే వ్యాక్సిన్ ఇచ్చారనే విషయాన్ని గుర్తుచేశారు. భారత్‌లో పూర్తిగా వ్యాక్సినేషన్ చేయడానికి చాలా సమయం పట్టవచ్చునని అభిప్రాయపడ్డారు. వ్యాక్సిన్ తయారుచేయడంలో భారత్ ముందుందని తెలిపారు. వ్యాక్సిన్ తయారుచేయడంలో కావాల్సిన ముడిసరుకులను ఆయా దేశాలతో సంప్రదించి వ్యాక్సిన్ తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాగా భారత్‌లో కరోనా ఉధృతి నేపథ్యంలో భారత్ నుంచి వచ్చే ప్రయాణికులపై అమెరికా ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ నెల (మే) 4వ తేదీ నుంచి ఈ ఆంక్షలు అమలులోకి వచ్చేలా జో బైడెన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైట్ హౌస్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

# కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా కేంద్ర పాలన : రామకృష్ణ



విజయవాడ: కరోనాను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు గుప్పించారు. నగరంలో నిర్వహించిన మేడే వేడుకల్లో రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికుల హక్కులను కాలరాశారన్నారు. రైతు పేరు చెప్పి.. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకొచ్చారని తెలిపారు. కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా కేంద్రం పాలన సాగుతుందని విమర్శించారు. నరేంద్రమోదీ విధానాలకు వ్యతిరేకంగా అందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో కరోనా రోగుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. బెడ్, ఇంజక్షన్, వ్యాక్సిన్, స్మశానంలో అంత్యక్రియలకు కూడా క్యూలు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అంబానీ, ఆదానీ ఆస్తులు రెట్టింపు అవుతుంటే.. పేదవాడు మరింత పేదవానిగా మారుతున్నాడని ఆవేదన వ్యకత్ం చేశారు. నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని బుద్ధి చెప్పే వరకు దేశ వ్యాప్తంగా అందరూ ఐక్యంగా పోరాడాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

# ప్రస్తుతం భారత్‌లో డేంజర్ పరిస్థితి: కేఏపాల్

విశాఖపట్నం: భారత్‌లో వచ్చిన కరోనా కేసులు.. ప్రపంచంలో మరెక్కడా రాలేదని కేఏపాల్ అన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు రద్దు చేయాలని కోరుతూ కేఏపాల్ చేపట్టిన దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో డేంజర్ పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి పనికిమాలిన సలహాలు తీసుకుని తమ భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారని అన్నారు. జగన్ రాజకీయ శత్రువుగా మారుతున్నారని తెలిపారు. "సోమవారం కోర్టు తీర్పు కచ్చితంగా రద్దు చేయాలని వస్తుంది... ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి... నేను వెంటనే దీక్ష విరమిస్తానువవ అని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పిల్లలు పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నారని తెలిపారు. నిన్న డూప్లికేట్, డాక్టర్లు, పోలీసులను పంపించి కేజీహెచ్‌లో తనను చంపడానికి ప్రయత్నించవద్దని... డాక్టర్‌ని పంపించవద్దని తాను కేజీహెచ్‌కు వెళ్లనని... తనను చంపిన ఇక్కడే దీక్ష చేస్తానని స్పష్టం చేశారు. బీపీ, షుగర్ లెవెల్ బానే ఉన్నాయన్నారు. "నేను గతంలో ఉపవాస దీక్షలు చేశాను.. నాకు గురించి ఏమి భయపడక్కర్లేదని... నాకేం కాదు..వాయిదా వేయండి నేనే మీ ఇంటికి వచ్చి కలుస్తానువవ అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాను అరికట్టడంలో విఫలమయ్యారని కేఏ పాల్ విమర్శలు గుప్పించారు.

# ఏపీలో 19 వేలు దాటిన కరోనా కేసులు..

### మొత్తం 8 వేలు దాటిన మరణాలు



అమరావతి : ఏపీలో కరోనా ఉధృతి రోజురోజుకూ పెరుగుతున్నది. గడిచిన 24 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 19,412 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడిన వారిలో 61 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో పాజిటివ్ కేసులు 11,18,207కు పెరిగాయి. మరణాల సంఖ్య 8 వేలు దాటింది. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ 98,214 శాంపిల్లను పరీక్షించినట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

# సంపాదకీయం

ఆదివారం 02 మే 2021

## ఈసీ వర్సెస్ హైకోర్టు.. మాటల మంటలు

కరోనా రెండో కెరటం దేశంలో ఇంతగా విర్రవీగి విజృంభించడానికి నువ్వే, ముమ్మాటికీ నువ్వే కారణమని ఎన్నికల సంఘాన్ని ఒక రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వేలెత్తి చూపడం చిన్న విషయం కాదు. దేశంలో కరోనా వ్యాప్తికి ఎన్నికల కమిషన్‌ను బాధ్యులు చేసి, అధికారులపై హత్యకేసు నమోదుచేయాలనిమద్రాస్ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టుకు ఈసీ శుక్రవారం కీలక అభ్యర్థన చేసింది. మౌఖిక పరిశీలన ద్వారా రిపోర్టింగ్ చేయకుండా మీడియాను నిరోధించాలని కోరింది. అంతేకాదు, రాష్ట్రాలలో కోవిడ్ వ్యాప్తికి ఎన్నికల ప్రచారం ఒక ముఖ్యమైన కారకమని చెప్పడానికి ఎటువంటి ఆధారం లేదని వాదించింది.ఎటువంటి ఆధారాల్లేకుండా మౌఖికంగా మీడియాలో వచ్చిన నివేదికలే ఈ పరిస్థితికి కారణమని ఎన్నికల కమిషన్ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఎన్నికలు నిర్వహించే రాజ్యాంగ బాధ్యతను అప్పగించిన స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా భారత ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠను ఈ నివేదికలు దెబ్బతీశాయి''అని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌పై మీడియా రిపోర్ట్ ఆధారంగానే హత్యానేరం ఆరోపణలపై పోలీస్ కేసు నమోదయ్యిందని తెలిపింది.విచారణను రికార్డ్ చేయడానికి న్యాయస్థానం ఎవరినీ అనుమతించరాదు.. ప్రత్యేకించి వివరణాత్మక ఉత్తర్వులు అందుబాటులోకి వచ్చినప్పుడు.. ఏప్రిల్ 4 న తమిళనాడులో ప్రచారం ముగిసినప్పటి నుంచి న్యాయస్థానం అలాంటి పరిశీలనలు చేసిన సందర్భం లేదు'' అని ఈసీ వాదించింది. "అంతేకాదు, ఎన్నికల లెక్కింపులో కోవిడ్ నిబంధనలపై కలకత్తా, కేరళ హైకోర్టులు కూడా సంతృప్తి వ్యక్తం చేశాయి.. కేరళ, పశ్చిమ్ బెంగాల్, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిలో ఎన్నికల ప్రకటన వెలువడేసరికి తక్కువ సంఖ్యలో కేసులు ఉన్నాయి" అని పేర్కొంది.మార్చి 20- ఏప్రిల్ 4 మధ్య ఎన్నికలు జరిగిన రాష్ట్రాలు.. ఎన్నిక జరగని రాష్ట్రాలతో పోల్చితే కోవిడ్ కేసులు పెరగడానికి ప్రచారం ఒక ముఖ్యమైన కారకం కాదని తెలుస్తోంది.. కోర్టు ఏకపక్షంగా పేర్కొన్న దానికంటే చాలా తక్కువ" అని తెలిపింది. ఎన్నికలు జరగని మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర్ ప్రదేశ్, ఢిల్లీలో భారీగా కేసులు నమోదవుతున్నాయని పేర్కొంది. కాబట్టి, రెండో దశ కోవిడ్ వ్యాప్తికి ఈసీ ఎటువంటి బాధ్యులుకాదని, అధికారులపై ఎటువంటి కేసులు నమోదుచేయరాదని కోరింది.రాజ్యాంగ సంస్థల వైఫల్యం తరచూ రుజువవుతున్నా కిమ్మనకుండా భరిస్తున్న దేశ ప్రజల మౌన వేదనను మద్రాసు హైకోర్టు సోమవారం నాడు తీవ్రమైన పదజాలంతో వ్యక్తం చేసింది. ఐదు అసెంబ్లీల ఎన్నికల ఘట్టంలో ఎలెక్షన్ కమిషన్ వ్యవహరించిన తీరు నిజంగానే అందరికీ ఆశ్చర్యం కలిగించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని బ్యాలట్ పోరు సాగిస్తున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను 8 దశలుగా విభజించడం విస్మయపరిచింది. ఆ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం జరిపి ఓటర్లను తనవైపు తిప్పుకొని తాను కోరుకున్న విజయాన్ని సాధించుకోడానికి కేంద్ర పాలకులు ఎన్నికల సంఘం మెడలు వంచి అక్కడ పోలింగ్‌ను 8 విడతలకు పొడిగింపజేశారనే విమర్శ వాటి తేదీలను ప్రకటించినప్పుడే దూసుకు వచ్చింది.మీడియా ఈ అంశానికి తగినంత ప్రాధాన్యం ఇవ్వలేదు. ఎన్నికల ప్రచారానికి భారీ బహిరంగ సభలు నిర్వహించి జనాన్ని లక్షలాదిగా ఒక్క చోట చేర్చినందువల్ల ఆ సభలు కరోనాను ఎంతగా వ్యాప్తి చెందిస్తాయో చెప్పనక్కర లేదు. మాస్కులు కూడా లేకుండా వేలు లక్షలాది మంది జనం గంటల తరబడి ఒక చోట కూచుంటే మంది ప్రాణాలను మహమ్మారి ఆకలి తీరా విందు చేసుకుంటుందనే ఇంగితం కూడా లోపించి ఎన్నికల సంఘం ప్రేక్షక పాత్ర వహించిన మాట వాస్తవం. భారీ ఎన్నికల సభలు జరపకుండా రాజకీయ పార్టీలను నివారించలేకపోయిన ఇసియే దేశంలో కొవిడ్ సెకండ్ వేవ్‌కు కారణమని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ బెనర్జీ, న్యాయమూర్తి సెంథిల్ కుమార్ రామమూర్తిల ధర్మాసనం పేర్కొన్నది. 77 మంది అభ్యర్థులు పోటీ చేసిన కరూర్ నియోజక వర్గం ఓట్ల లెక్కింపు పకడ్బందీ కొవిడ్ జాగ్రత్తలతో జరిపేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. అంతేకాదు ఎన్నికల సంఘం అధికారులపై హత్య కేసులు పెట్టాలని అన్నది. ఎన్నికల ప్రచార సభలు జరుగుతున్నప్పుడు మీరేం చేస్తున్నారు, ఇతర గ్రహాల్లో విశ్రాంతి చిత్తగిస్తున్నారా అని ఘాటుగా ప్రశ్నించింది. బహుశా మన ఎన్నికల సంఘం తన చరిత్రలో ఎన్నడూ ఇటువంటి న్యాయాభిశంసనకు గురై ఉండదు.మే 2 నాటి ఓట్ల లెక్కింపు ఘట్టం గట్టి కొవిడ్ జాగ్రత్తలతో జరిగేలా చూడాలని అందుకు ఉద్దేశించిన కార్యాచరణను ఈ నెలాఖరుకు తనకు సమర్పించాలని లేకుంటే కౌటింగ్‌ను నిలిపివేస్తానని కూడా ధర్మాసనం హెచ్చరించింది. ప్రధాని మోడీ సహా పెద్దలందరూ ఎడాపెడా ఎన్నికల సభల్లో మాట్లాడి కరోనా విపత్తును ఇంతగా రెచ్చగొట్టారనేది కొట్టిపారేయలేని కఠోర వాస్తవం. వారిని కూడా కట్టడి చేసి సభలు జరపకుండా, అవసరమైతే ఎన్నికలను వాయిదా వేసే అధికారాలున్న ఎన్నికల సంఘం వాటిని ఇంతటి జాతీయ విపత్తు సమయంలో ఎందుకు ప్రయోగించలేదనేది సబబైన ప్రశ్న. నిర్ణీత వ్యవధికి లోబడి ఎన్నికలను వాయిదా వేసే, నిలుపుదల చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. గడువులోగా ఎన్నికలు నిర్వహించలేనని అది తెలియజేస్తే కేంద్రం ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధింప చేయవచ్చునని కూడా నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికలను వాయిదా వేసిన సందర్భాలున్నాయి.1991లో పార్లమెంటు ఎన్నికలు సగంలో ఉన్నప్పుడు తమిళనాడులో రాజీవ్ గాంధీ హత్య జరిగింది. అప్పుడు తదుపరి ఎన్నికల ఘట్టాన్ని మూడు వారాల పాటు వాయిదా వేశారు.2020 మార్చిలో 18 రాజ్యసభ స్థానాల ఎన్నికలు కరోనా కారణంగా వాయిదా పడ్డాయి. ఎన్నికల సంఘానికి, దాని అధికారులకు తమకున్న అధికారాల గురించి తెలియవని అనుకోలేము. కొవిడ్ ఇంతగా విజృంభిస్తున్నప్పుడు మూలనున్న సంచిలో నుంచి వాటిని బయటికి తీసి ప్రయోగించి ఉండవలసింది. ఏ కారణం వల్లనో అది జరగలేదు. ప్రజల ప్రాణ రక్షణ బాధ్యత మిగతా అన్నింటికంటే ఉత్కృష్టమైనదని భావించిన మద్రాసు హైకోర్టు ధర్మాసనం నిద్రపోతున్న ఎన్నికల సంఘాన్ని తట్టిలేపి ఈ విధంగా తూర్పారబట్టడం ఎంతైనా సమంజసంగా ఉంది. వాస్తవానికి మన వంటి సువిశాల ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ ఘట్టం పూర్తి తటస్థ వాతావరణంలో జరగాలి.

# టీటీడీ యూ టర్న్...

తిరుపతి, మే 1, (న్యూస్ పల్స్)ర్థిక భారం తగ్గించడానికి టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఆదాయం లేని ఆలయాల పర్యవేక్షణను వెనక్కు తీసుకోనుంది. దీని వల్ల టీటీడీకి వచ్చే ప్రయోజనమేంటి? ఆలయాలు నిర్వహణ పేరిట ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ఖర్చును తగ్గించుకోవడానికి టీటీడీ పాలక మండలి నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ పరిధిలో ఇప్పటికే 32 ఆలయాలున్నాయి. అయితే తమ ప్రాంతంలోని ఆలయాలను టీటీడీ స్వాధీనం చేసుకుని పర్యవేక్షించాలని పలువురు నేతలు ఎప్పటినుంచో విన్నవిస్తున్నారు.అయితే వారి వినతులను పక్కన పెట్టింది. కరోనా వైరస్ కారణంగా సామాన్య ప్రజలే కాదు ఆర్థిక సంస్థలు, ఆలయాలు కూడా కుదేలు అవుతున్నాయి. గత ఏడాది భారత్ పై కోవిడ్-19 పంజా విసరడంతో?.2020-21 ఆర్థిక సంవత్సరానికి 12 వందల కోట్ల రూపాయల హుండీ ఆదాయాన్ని అంచనా వేసింది ఆర్థిక విభాగం. లాక్ డౌన్‌తో అంచనాలు అంత తారుమారు అయ్యాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఏడు వందల 21 కోట్ల రూపాయలు మాత్రమే శ్రీవారి హుండీ ద్వారా ఆదాయం లభించింది.గత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కుదిస్తూ రెండు వేల 553 కోట్ల రూపాయలకు పరిమితం చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాను రెండు వేల 9 వందల 37 కోట్ల రూపాయలకు అంచనా వేసింది టీటీడీ. అయితే నిత్యం శ్రీవారి హుండీ ద్వారా లభించే ఆదాయం.. లడ్డు విక్రయాలు గతంలో పోల్చితే తగ్గుముఖం పట్టింది. అలాగే ఆర్జిత సేవలు ఏకాంతం చేయడంతో ఆదాయం మరింత తగ్గింది.ఆలయాల పరిరక్షణ కోసం టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పురాతన ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు నిధులు సమకూర్చడమే కాకుండా?.శ్రీవారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి టీటీడీ సంకల్పించింది. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా గతంలో ఐదు వందల నుంచి ఏడు వందల వరకు శ్రీవారి టిక్కెట్లను కేటాయిస్తూ వస్తోంది టీటీడీ. ప్రస్తుతం కరోనా కారణంగా కేవలం 200 టిక్కెట్లను మాత్రమే రోజువారీగా జారీ చేస్తూ వస్తోంది. దీంతో ఫిబ్రవరి మాసంలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఖర్చును తగ్గించే మార్గం ఎంచుకుంది.ప్రస్తుతం టీటీడీ పరిధిలో 32 ఆలయాలు ఉన్నాయి. వాటి పూర్తి బాధ్యత టీటీడీనే చూసుకుంటుంది. ఈ ఆలయాల్లో టీటీడీ ఉద్యోగితో పాటు?మరి కొందరిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించాల్సి వస్తోంది. తద్వారా ఆలయాలకు వెచ్చించే ఖర్చు మరింత పెరుగుతోంది. ఆలయాలను టీటీడీ పరిధిలో తీసుకుంటే మరింత భారం పెరిగే అవకాశం ఉండటంతో నూతనంగా ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకోరాదని తీర్మానించింది. తమ ప్రాంతాల్లో కూడా ఆలయాలను పర్యవేక్షించాలని భారీగా విన్నతులు అందుతుండటంతో ఈ నిర్ణయం తీసుకుట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం ఇప్పుడే కొత్తగా ప్రతిపాదించింది కాదు.గతంలోనూ అనేకసార్లు టీటీడీ పాలకమండలిలో సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. మొదటి సారిగా 1997లో ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకోరాదని అప్పటి పాలకమండలి నిర్ణయం తీసుకుంది. 2005లో మరోసారి ఇదే అంశంపై తీర్మానం చేసారు. ఇక 2012లోనూ ఈ అంశం మళ్లీ చర్చకు వచ్చింది. దీనిపై ఇంజినీరింగ్, అకౌంట్స్, ఎస్టేట్, న్యాయ, సర్వీసు విభాగాల అధికారులు పరిశీలించి?వారు ఇచ్చే నివేదిక ఆధారంగా పర్యవేక్షణపై తుది నిర్ణయానికి రావాలని అప్పటి పాలకమండలి అభిప్రాయపడింది.ప్రస్తుతం టీటీడీ పరిధిలో తీసుకోవాలని విన్నతులు వస్తున్న ఆలయాలు మారుమూల ప్రాంతంలో ఉండటం..వాటి ఆదాయం మార్గాలు నామమాత్రంగా ఉండటంతో మరింత భారంగా మారుతున్నాయి. ఇక ఆ ఆలయాలకు సంబంధించిన భూములు., ఇతర ఆస్తులు వివాదాల్లో చిక్కుకోవడం..వాటిని విడిపించేందుకు టీటీడీ భారీగా నిధులు కేటాయించాల్సి వస్తోంది. ఇక ఆలయాలను పర్యవేక్షిస్తున్న సిబ్బందికి టీటీడీ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉందిపర్యవేక్షణకు తీసుకున్న దేవాలయాల్లో.. అంతకుముందు పండగలు, ఇతర కార్యక్రమాలకు నామమాత్రంగానే నిధులు వెచ్చించేవారు. ఇప్పుడు భారీగా ఖర్చు చేసి భారాన్ని టీటీడీపై మోపుతున్నారు. ఆయా ఆలయాల పరిధిలోని భూవివాదాలు, ఇతర సమస్యలపై న్యాయస్థానంలో పిటిషన్లు వేస్తున్నారు. ఇలా అనేక కేసులు కోర్టులలో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఇటువంటి సమస్యలను అధ్యయనం చేసిన టీటీడీ కనీస ఆదాయం లేని ఆలయాల టేకోవర్ చేసే ఆలోచన విరమించుకుంది.

# వేస్టేజ్ కట్టడికి పక్కా ప్లాన్

విజయవాడ, మే 1, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో కోవిడ్ నియంత్రణకు సంబంధించి ప్రతి అంశంలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. మూడంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మందులు, ఆక్సిజన్, వ్యాక్సిన్ ఇలా అన్ని విషయాల్లోనూ తక్షణమే వృథా (వేస్టేజీ)ను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి విభాగంలోనూ కొంతమంది అధికారులను పర్యవేక్షణకు నియమించారు. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. వృథాను అరికట్టడం ద్వారా వేలాది మంది పేషెంట్లకు అదనంగా వైద్యసేవలు అందించే అవకాశం ఉంటుంది.వాస్తవానికి కరోనా నియంత్రణకు ఇచ్చే రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు ఇతర రాష్ట్రాల్లో కంటే ఏపీలో ఎక్కువ ఉన్నాయి. కానీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చిన ఇంజక్షన్లు దాచేసి బ్లాక్‌మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించారు. దీన్ని మొదట్లోనే గుర్తించిన ఔషధ నియంత్రణ అధికారులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రెమ్‌డెసివిర్‌లను ఎలా? ఎవరికి ఉపయోగించారు? అన్నదానిపై ఆడిట్ చేస్తున్నారు. ఉదాహరణకు ప్రైవేటులో పదివేల పడకలు ఉంటే అందరికీ రెమ్‌డెసివిర్‌ల అవసరం ఉండదు. దీన్నిబట్టి ఎలా చేశారన్నది అంచనా వేయవచ్చు. ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే స్టాకును ఏరోజు కారోజు నివేదిక తెప్పించి పరిశీలిస్తున్నారు. ఒక్క ఇంజక్షన్ తేడావచ్చినా ఆయా ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటారు.దేశవ్యాప్తంగా ఆక్సిజన్ కొరత వేధిస్తోంది. ఏపీలో సరిపడా నిల్వలు ఉన్నప్పటికి కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది వైద్యులు ఆక్సిజన్ శాతం 96గా ఉన్న పేషెంట్లకు కూడా ఆక్సిజన్ ఇస్తున్నారు. దీంతో నిజంగా ఆక్సిజన్ అవసరమైన వారికి ఆలస్యం అవుతోంది. దీంతో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా ఆక్సిజన్ నిర్వహణకు జిల్లాల వారీగా, ఆస్పత్రుల వారీగా ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఎప్పటికప్పుడు ఆక్సిజన్ నిల్వలను పర్యవేక్షిస్తున్నారు.కరోనా వ్యాక్సిన్ వేయడమనేది తొలిసారి. ఇందులో సిబ్బందికి ఎంతగా శిక్షణ ఇచ్చినా కూడా వృథా జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27 నాటికి 7.93 శాతం వృథా అయినట్టు తేలింది. వ్యాక్సిన్ మొదలుపెట్టిన తొలిరోజుల్లో వేయించుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఒక వయెల్ ఓపెన్ చేస్తే కనీసం 10 మందికి వేయవచ్చు. కానీ ఒక్కరే వస్తే 9 మందికి వేసే డోసు వృథా అవుతుంది. ప్రస్తుతం వ్యాక్సిన్‌పై అందరికీ అవగాహన పెరిగి, వేయించుకోవడానికి సిద్ధపడుతున్న నేపథ్యంలో వ్యాక్సిన్ల వృథా ఉండదని అంచనా.

# టీడీపీకి దిక్కు లేదే

విశాఖపట్టణం, మే 1, (న్యూస్ పల్స్)ఉత్తరాంధ్ర అంతటా ఓడిపోతేనేమి. మెగా సిటీ విశాఖలోని నాలుగు దిక్కులా పసుపుదనం నిండుగా పరచుకుంది అన్న సంబరం తమ్ముళ్ళకు అట్టే కాలం నిలవలేదు. పేరుకే నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు విశాఖ మేయర్ సీటు వైసీపీకి దక్కడంతో పోయిందిగా పరువు అన్న మాట తమ్ముళ్ళ నోట వినిపిస్తోంది. ఇక విశాఖ సిటీలో కూడా గట్టిగా కాలు పెట్టేసిన వైసీపీ అంతటితో ఊరుకుంటుందా టీడీపీ ఎమ్మెల్యేల ఆధిపత్యానికి గండి కొడుతూ జోరుగా దూసుకుపోతోంది.విశాఖ పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేగా పెతకంశెట్టి గణబాబు ఉన్నారు. ఆయన తండ్రి పెతకంశెట్టి అప్పలనరసింహం ద్రోణంరాజు సత్యనారాయణ స్థాయి నాయకుడు. కాంగ్రెస్ లో ఉంటూ టీడీపీ పెట్టడంతో అందులోకి వచ్చిన తొట్ట తొలి నేత. ఎన్టీయార్ ఆయన్ని గౌరవించి ఎమ్మెల్యేగా, ఎంపీగా చేశారు. ఇక ఆయన వారసుడిగా వచ్చిన గణబాబు ఇప్పటికి మూడు విడతలుగా ఎమ్మెల్యేగా నెగ్గుతూ వచ్చారు. మధ్యలో ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్ళినా కూడా మళ్లీ సైకిలెక్కేశారు. ఇలా టీడీపీ నుంచే ఆయన విజయాలు అందుకున్నారు. ఇపుడు ఆ పశ్చిమ టీడీపీ కోటకే బీటలు వారిపోతున్నాయని తమ్ముళ్ళు తెగ పరేషాన్ అవుతున్నారు.పశ్చిమ నుంచి గణబాబుని వైసీపీలోకి చేర్చుకోవాలని అప్పట్లో కొంత ప్రయత్నం జరిగింది. మొదట్లో ఆయన ఏమనుకున్నారో కానీ కొంత సైలెంట్ అయ్యారు. దాంతో పార్టీ వారికి కూడా అనుమానం వచ్చింది. మళ్ళీ ఆయన టీడీపీలో యాక్టివ్ అయినా మునుపటి జోరు కనిపించడంలేదు. ఇదే అదనుగా వైసీపీ అక్కడ దూకుడు పెంచేసింది. మహా విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజారిటీ వార్డులను ఇక్కడ గెలుచుకుని సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యేకు గట్టి దెబ్బ కొట్టేసింది. ఇపుడు వరసగా టీడీపీలోని బలమైన నాయకులను వైసీపీలోకి చేర్పించే పనిలో మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ బిజీగా ఉన్నారు. మొత్తానికి విశాఖ పశ్చిమంలో టీడీపీ పునాదులు బాగానే కదులుతున్నాయని చెప్పాల్సిందే.విశాఖ సౌత్ లో ఏకంగా టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీలోకి చేరిపోయారు. దాంతో అది ఫ్యాన్ పార్టీ ఖాతాలోనే ఉంది. తూర్పు నియోజకవర్గంలో వెలగపూడి రామక్రిష్ణబాబుకు తొలిసారి ఓటమిని కార్పొరేషన్ ఎన్నికల్లో చవి చూపించేశారు. మెజారిటీ కార్పోరేటర్లు వైసీపీ పరం అయ్యారు. దాంతో వెలగపూడి డీలా పడిపోయారు. ఇక్కడ కూడా టీడీపీని తగ్గించే పని మొదలైంది. మరో వైపు ఉత్తర నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఏనాడో గాలికి వదిలేశారు. దాంట్లో రెండు తప్ప అన్ని వార్డులూ వైసీపీ సొంతం అయ్యాయి. ఈ విధంగా చూసుకుంటే మంచానికి నాలుగు కోళ్ళ అన్న మాదిరిగా పేరుకు నాలుగు సీట్లు టీడీపీ గెలుచుకున్నా రెండేళ్ళు తిరగకముందే ఇక్కడ టీడీపీ పునాదులు కదిలిపోతున్నాయి. వైసీపీ పక్కా వ్యూహంతో ఈ నాలుగు చోట్లా వచ్చే ఎన్నికల్లో జెండా ఎగరేయడానికి రంగం సిద్ధం చేసింది.

# జగన్ తో జనం..బంధం

తిరుపతి, మే 1, (న్యూస్ పల్స్)దేళ్ల పాటు జగన్ జనమే తానుగా బతికారు. తండ్రి వైఎస్సార్ పోయిన తరువాత తొలిసారి నల్లకాలువ వద్ద జరిగిన మీటింగులో జనంలోకి వచ్చిన జగన్ నాటి నుంచి అలుపెరగకుండా ఉమ్మడి ఏపీని పట్టుకుని గట్టుకీ పుట్టనీ వదలక తిరిగారు. మొదట ఓదార్పు యాత్ర అన్నారు. దానికి మంచి రెస్పాన్స్ రావడంతో అది కాస్తా రాజకీయ యాత్రగా మారిపోయింది. ఇక ఉమ్మడి ఏపీలో ఏదో ఒక ప్రజా కార్యక్రమం ఎంచుకుని నాటి సర్కార్ కి వ్యతిరేకంగా జగన్ రోడ్ల మీదకు వచ్చేవారు. అవన్నీ సూపర్ డూపర్ హిట్లు అయ్యాయి.అంతవరకూ నేతలు జనాల్లోకి వచ్చినా కూడా జగన్ అంతలా కనెక్ట్ అయిన సందర్భాలు అయితే లేవు. నేరుగా తెలుగు రాష్ట్రాలలోని జనాల ఇళ్లలోకి జగన్ వెళ్ళి వారితో మాటలు, మంతనాలు పెట్టడాలు మాత్రం అప్పట్లో న్యూ ట్రెండ్ అని చెప్పాలి. వారి గుడిసెల్లోనే నేల మీద కూర్చుని వారి పెట్టినదేదో కలసి తినడం ద్వారా తాను జనం మనిషిని అనిపించుకున్నారు. ఇక దాదాపుగా ఏణ్ణర్థం పాటు సాగిన జగన్ పాదయాత్ర ఒక చరిత్రగానే చూడాలి. దాని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇలా జనం నుంచి జగన్ ని ఎవరూ విడదీయలేరు అనేంతగా ఆయన బలమైన బంధం వేసుకున్నారు.సరే జగన్ తాను కోరుకున్న టార్గెట్ ని రీచ్ అయ్యారు. ఆయన ముఖ్యమంత్రి కావాలనుకున్నారు. జనాల అపూర్వమైన ఆశీర్వాదంతో 151 సీట్లతో ఏపీ ముఖ్యమంత్రి సీటును పట్టేశారు. ఆ తరువాతనే జగన్ లో కొత్త మార్పు వచ్చింది. ఆయన అసలు బయటకు రావడమే బాగా తగ్గించారు. రెండేళ్ళ పాలనలో జగన్ జనాల వద్దకు వచ్చిన సందర్భాలు బహు అరుదుగా ఉన్నాయి. జగన్ అంటే పిచ్చి ప్రేమ పెంచుకున్న జనాలు కూడా ఇపుడు ఆయనను చూడాలనుకుంటే అది అందని వరమే అయిపోతోంది. జగన్ ప్రచారం చేయకుండానే లోకల్ బాడీ ఎన్నికలు పూర్తి అయ్యాయి. తిరుపతి ఉప ఎన్నిక కూడా ముగిసింది. మరి జగన్ జనంలోకి రావాల్సిన సందర్భం ఇంతకంటే ఏదీ కూడా లేదు. కానీ వాటినే వద్దనుకున్న జగన్ జనాలలోకి ఎపుడు వస్తారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది.జగన్ ఓట్ల కోసం తిరుపతి వచ్చి జనాలను అడగలేదని విపక్షం అంటోంది. చంద్రబాబు అయితే జనాలను ఓటు వేయమని అడగని జగన్ కి జనం అంటే ఉన్న ప్రేమ ఏమిటో తెలిసింది అంటున్నారు. ఒక విధంగా వైసీపీ నేతలకు కూడా జగన్ జనంలోకి రాకపోవడం వల్ల ఇబ్బందిగానే ఉంది. జగన్ వైసీపీలో ఏకక ప్రజాకర్షణ నేత. ఆయన రాను అంటే ఎవరూ ఏమీ చేసేది ఉండదు. కానీ ఈ జనాలు ఎలాంటి వారు అంటే ఎంతగా ప్రేమిస్తారో చిన్న తేడా వస్తే అంతకు అంత కోపాన్ని చూపిస్తారు. అందువల్ల వారితో ఆ లింక్ కి అలా కంటిన్యూ చేయాల్సిందే. లేకపోతే బోడి మల్లయ్యలుగా తమను చూశారన్న భావన కలిగితే మాత్రం అది వైసీపీకి యమ డేంజరే. జగనే జనాల వద్దకు వెళ్ళారు. ప్రజా నాయకుడు ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు. సరే అధికారంలో ఉన్న వారికి చాలా పనులు ఉంటాయి. అంతమాత్రం చేత ఏదో ఒక సందర్భంలో జనాల వద్దకు వచ్చి పలకరించకపోతే వారు హర్ట్ అవుతారు. జగన్ తీరు మాత్రం ఒకనాడు అతివృష్టిగా ఉంటే ఇపుడు అనావృష్టిగా మారింది అంటున్నారు. ఏదీ ఎక్కువ కాకూడదు. రాజకీయ లెక్కల్లో తేడాలొచ్చేస్తాయి. మరి ఇది జగన్ గ్రహిస్తారా.

# గ్రామాలపై గజరాజులు



తిరుపతి, మే 1, (న్యూస్ పల్స్)కౌండిన్య అభయారణ్యంలో ఆహారం, నీటి లభ్యత తక్కువగా ఉండటంతో చిత్తూరు జిల్లా పలమనేరు పరిధిలోని కౌండిన్య ఎలిఫేంట్ శాంచ్యురీ నుంచి ఏనుగులు గ్రామాల వైపు వస్తున్నాయి. రైతులు వన్యప్రాణుల నుంచి పంటలకు రక్షణగా కరెంటు తీగలను అమర్చుతుండటంతో అవి విద్యుత్ షాక్‌కు గురై మరణిస్తున్నాయి. అడవిలోని దట్టమైన మోర్ధనా అభయారణ్యంలోకి ఏనుగులు వెళితే అక్కడ తమిళనాడు అటవీ శాఖ సిబ్బంది రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరుపుతున్నారు. దీంతో తమిళనాడు ప్రాంతంలోని ఏనుగులు సైతం కౌండిన్య వైపునకు వచ్చి చేరుతున్నాయి. ఇక కర్ణాటక నుంచి ఏనుగులు గుడుపల్లి, కుప్పం మీదుగా ఇదే అడవిలోకి వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో మూడు గుంపులుగా 36 ఏనుగులు సంచరిస్తున్నాయి. తమిళనాడు మోర్ధన అభయారణ్యం నుంచి 26 ఏనుగులు తరచూ వచ్చి వెళుతున్నాయి. ఇక 24 ఏనుగులు కర్ణాటక నుంచి కుప్పం ఫారెస్ట్‌లోకి 2 నెలల క్రితం రాగా అటవీ సిబ్బంది వాటిని తిరిగి కర్ణాటక అడవుల్లోకి మళ్లించారు. మేత కోసం అటవీ శాఖ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్, ఎలిఫేంట్ ట్రెంచ్‌లను ధ్వంసం చేసి మరీ ఏనుగులు బయటకు వచ్చేస్తున్నాయి అడవిని దాటి మేత కోసం వచ్చిన 16 ఏనుగులు ఇప్పటిదాకా కరెంట్ షాక్‌లకు గురవడం, నీటికొలనుల్లో పడిపోవడం, మదపుటేనుగుల దాడి చేయడంతో మృతి చెందాయి. ఇక గుంపులను వీటి ఒంటరిగా సంచరించే మదపుటేనుగులను అడవిలోకి మళ్లించేందుకు రైతులు వాటిపైకి టైర్లను కాల్చి వేస్తున్నారు. ఒక్కో సందర్భంలో రాళ్లు విసరడం, బాణాసంచా పేల్చడంతో అవి మనషులపై కోపాన్ని పెంచుకుని దాడులు చేస్తున్నాయి. కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ. మేరకు వ్యాపించి ఉంది. దీంతో ఏనుగుల జాడను గుర్తిం చేందుకు జీపీఎస్ చిప్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నట్లు అటవీ శాఖ గతంలో తెలిపింది. ఇందుకోసం కౌండిన్యలో నెట్‌వర్క్ పనిచేసేలా శక్తివంతమైన టవర్‌లను నిర్మించాల్సి ఉంటుంది. ఆపై ఎలిఫేంట్ ట్రాకింగ్ యాప్‌ను తయారు చేసి దీన్ని అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ట్రాకర్ల స్మార్ట్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఏనుగులు ఏ ప్రాంతంలో ఉన్నాయనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఏనుగుల గుంపును వెంటనే ఎలిఫేంట్ ట్రాకర్స్ వాటిని అడవిలోకి మళ్లించవచ్చు. అలాగే, కౌండిన్య అభయారణ్యం 3 రాష్ట్రాల పరిధిలో ఉండటంతో 3 రాష్ట్రాలు కలసి ఎలిఫేంట్ కారిడార్ ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

# మెడికల్ దందాపై నిఘా

విజయవాడ, మే 1, (న్యూస్ పల్స్)ష్ట్రంలో కోవిడ్ బాధితులకు ఇచ్చే రెమ్‌డెసివిర్ ఇంజక్షన్ల బ్లాక్‌మార్కెటింగ్‌పై అధికారులు నిఘా పెంచారు. ఈ ఇంజక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న నలుగురిని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పట్టుకున్నారు. ఈ ఇంజక్షన్‌ను కొందరు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై ఔషధ నియంత్రణశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సీ అండ్ ఎఫ్, హోల్‌సేల్ షాపులతో పాటు, ప్రైవేటు ఆస్పత్రులపైనా నిఘా పెట్టారు. గుంటూరులో బుధవారం ఓ వ్యక్తి 6 ఇంజక్షన్లు తీసుకెళుతుండగా పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి పట్టుకున్న వ్యక్తిని విచారిస్తున్నారు.గుంటూరు జిల్లా నరసరావుపేటలోని ఒక ఆస్పత్రి ఐసీయూలో రోగులకు ఇవ్వాల్సిన ఇంజక్షన్లను బయటకు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురు మేల్ నర్సింగ్ సిబ్బందిని పట్టుకున్నారు. 7 డోసుల ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ రెండు ఘటనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు నిఘా పెంచారు. రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు కేవలం కోవిడ్ అనుమతి ఉన్న ఆస్పత్రులకు మాత్రమే పంపిణీ జరగాలని,ప్రైవేటుగా ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోల్‌సేలర్లు, రిటెయిలర్లు కూడా ఇంజక్షన్ల లెక్క చెప్పాలని ఆదేశించారు. గుంటూరులో బ్లాక్ మార్కెట్‌లో ఇంజక్షన్ల విక్రయాల్లో వైద్యుల ప్రమేయం ఉన్నట్టు నగరంలోని వైద్యుల సంఘంలో గురువారం విస్తృతంగా చర్చ జరిగింది.

## హొళగుందలో ప్రపంచ కార్మికుల దినోత్సవం జరుపుకున్న సిపిఎం.సిఐటీయు నాయకులు

మే 02. మండల కేంద్రమైన హొళగుంద లో 135 వ మేడే దినోత్సవ సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సి ఐ టి యు జెండాను ఆఫీసు ముందు మరియు బస్టాండ్ లో సి ఐ టి యు జెండాను సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ , సీనియర్ నాయకుడు కట్టప్ప ఎర్ర జెండాను ఎగరవేశారు. వెంకటేష్ గారు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక పోరాట వేదిక మే డే 1886 మే 1న చికాగోలో పెట్టుబడిదారుల శ్రమదోపిడి ని నిరసిస్తూ ప్రపంచ కార్మికుల ఐక్యత తో విప్లవ శంఖం పూరించారు. ఆ ప్రదర్శన ఉధృతమై ఎంతో మంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు, అయినా కూడా ఆ కార్మికులు పోరాటంలో వెనుకంజ వేయకుండా తమ హక్కులను సాధించుకున్నారు. వారి త్యాగాలకు గుర్తుగా మేడే రోజుగా జరుపుకుంటున్నామని మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

# మురళీ మోహన్ సైలెంట్ వెనుక

విజయవాడ, మే 1, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో ఎప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో చెప్పలేం. ఇక, వ్యాపార పరంగాకూడా అంతే. ఏదైనా చేసేవ్వచ్చు.. సదరు వ్యవహారంపై పూర్తిగా పట్టుసాధించాలని నాయకులు భావిస్తారు. వ్యాపారంలో.. రాజకీయంలో ఆధిపత్యం సహజం. అయితే తమ పార్టీనే అధికారంలో ఉన్నా.. ఒక్కొక్కసారి తప్పటడుగులు వేస్తుంటారు. లేదా.. పార్టీ అధినేతలను ఒప్పించలేకపోతుంటారు. దీంతో సదరు నేతలు ఇప్పుడు జగన్ సర్కారు చేతిలో నలిగిపోతున్నారు. తాజాగా వెలుగు చూసిన ఓ విషయం చాలా విస్మయానికి దారితీసింది.టీడీపీలో సీనియర్ నాయకుడు, రాజమండ్రి నుంచి 2014లో విజయం దక్కించుకున్న సినీ నటుడు మాగంటి మురళీమోహన్‌కు జగన్ ప్రభుత్వం బాగానే వాత పెట్టిందని.. అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై అటు మురళీ మోహన్ కూడా ఎక్కడా యాగీ చేయకుండా.. సైలెంట్‌గా జగన్ ప్రభుత్వం చెప్పినట్టే నడుచు కున్నారని.. ఇక, టీడీపీ నేతలు సైతం ఎక్కడా దీనిని వివాదం చేయలేదని అంటున్నారు. విషయంలోకి వెళ్తే.. మాగంటి మురళీ మోహన్ సినిమాల్లో సంపాయించుకున్న సొమ్ముతో జయభేరి అనే నిర్మాణ సంస్థతో రియల్ ఎస్టేట్ బిజినెస్ కూడా చేశారు.ఈ క్రమంలో మురళీమోహన్ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక.. రాజధాని ప్రాంతం అమరావతిని దృష్టిలో ఉంచుకుని.. గుంటూరు జిల్లా (విజయవాడ బోర్డర్) తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లి ప్రాంతంలో.10 ఎకరాల వ్యవసాయ స్థలం కొన్నారు. వాస్తవానికి ఇది వ్యవసాయ సాగు భూమి. అంటే.. ఈ భూమిలో ఎలాంటి నిర్మా ణాలు చేపట్టకూడదు. ముఖ్యంగా నివాసాలకు అసలు వాడకూడదు. అయితే.. ఇలా వాడుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుని, ల్యాండ్ కన్వర్షన్ యాక్ట్ ప్రకారం వ్యవసాయేతర భూమిగా మార్చు కుంటే సరిపోతుంది.మరి ఈ విషయంలో మాగంటికి చంద్రబాబు ప్రభుత్వం పెద్ద దెబ్బ వేసేసింది. ఈ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటూ.. పెట్టుకున్న అర్జీని దాదాపు మూడు సంవత్సరాల పాటు తొక్కి పెట్టింది. దీనికి కారణాలు ఏమిటో తెలియదు. సరే.. 'ప్రభుత్వం మనదే కదా!' అనుకున్న మురళీమోహన్ ఆ భూమిలో భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు కట్టేశారు. ఇక, ఆ తర్వాత జగన్ ప్రభుత్వం వచ్చే వరకు ఈ భూమి తాలూకు వివాదాన్ని చంద్రబాబు సర్కారు పరిష్కరించలేదు.ఇక, జగన్ సర్కారు.. ఈ ఏడాది ప్రారంభంలోనే దీనిపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే మురళీ మోహన్‌కు నోటీసులు జారీ చేయడమే కాకుండా.. సుమారు రూ.2 కోట్ల రూపాయల వరకు ఫైన్ విధించింది. దీంతో ఈ విషయంలో చేతులు కాలాయని భావించిన మురళీ మోహన్.. ప్రభుత్వం వేసిన ఫైన్ చెల్లించి చాలా సైలెంట్ అయిపోయారు. ఇక, ఇదే విషయం తెలిసినప్పటికీ.. టీడీపీ నేతలు మౌనంగా ఉండటం గమనార్హం. మొత్తానికి తాజాగా వెలుగు చూసిన ఈ విషయం.. రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# ఏసీబీ కస్టడికి ధూళిపాళ్ల

రాజమండ్రి సంఘం డెయిరీలో అక్రమాలకు పాల్ప డ్డారనే ఆరోపణలపై అరెస్టు అయి రిమాండ్లో ఉన్న టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రను ఏసీబీ కస్టడీలోకి తీసుకుంది.తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి ఆయనను విజయవాడ తరలించారు. ఆయనతో పాటు సంఘం డెయిరీ ఎండీ, సహకార శాఖ మాజీ అధికారి గురునాథంను తీసుకెళ్లారు. వీరిని ఈ నెల 5 వరకు విచారించేందుకు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అనుమతిచ్చింది. ఆ మేరకు రాజమహేంద్రవరం నుంచి విజయవాడ తరలించారు. జైలు వద్ద తండ్రిని చూసి నరేంద్ర కుమార్తె కన్నీరుమున్నీరయ్యారు.

# యుద్ధ విమానాల్లో ఆక్సిజన్ ట్యాంకర్లు

విజయవాడ ఏపీ కు 470 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ను కేంద్రం కేటాయించినట్లు కోవిడ్ కేర్ సెంటర్ల ప్రత్యేక అధికారి కృష్ణబాబు తెలిపారు.రాష్ట్రం లో 20 వేల మందికి ఆక్సిజన్ అందిస్తున్నామని,వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి 70 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వస్తోందని దేశంలో ఇతర ప్రాంతాలు నుంచి 170 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వస్తోందని తెలిపారు.దేశంలో సుదూర ప్రాంతాలు నుంచి మారో 220 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వస్తోందని ఒరిస్సాలోని టాటా స్టీల్ ప్లాంట్, ఎస్సెల్యూ ల్ నుంచి అంగూరు ఆక్సిజన్ ఫిల్లింగ్ స్టేషన్ లో 100 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ఏపీ కేటాయించారని చెప్పారు.విజయవాడ నుంచి ఒరిస్సా వెళ్ళాలి. ఇక్కడ నుంచి 4 రోజులు పడుతుంది కాబట్టి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కార్గో విమానం కేటాయించారు. రెండు ట్యాంకర్లు ఒకటి 18 మెట్రిక్ టన్నులు, మరొకటి 28 టన్నుల ట్యాన్ కర్ కెపాసిటీ పంపించామని వచ్చిన ఆక్సిజన్ సక్రమంగా వినియోగం చేసేందుకు చర్యలు..తీసుకున్నామని గన్నవరం విమానాశ్రయం నుంచి కార్గో విమానం బయలుదేరి వెళ్లిందని గ్రీన్ ఛానెల్ ద్వారా వాహనాలు ఆక్సిజన్ వచ్చేందుకు ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

# పేద ముస్లింలకు చేయూత

భువనగిరి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ప్రముఖ వ్యాపారవేత్త ఎండి హన్ను భాయ్ నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ మాసం సందర్బంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ ఏసిపి సత్తయ్య గౌడ్ సిఐ శ్రీనివాస్ ప్రారంభించారు, హన్ను భాయ్ మాట్లాడుతూ నా యొక్క వార్షిక ఆదాయం నుండి జకాత్ రూపంలో ఈ కరోనా క్లిష్ట పరిస్థితులలో ప్రతి ఒక్క ముస్లిం కుటుంబాలలో రంజాన్ పండుగ సంతోషాలను నింపాలని నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నాను అదేవిధంగా ప్రతి ఒక్క వ్యాపారవేత్తలు చుట్టుపక్కల ఉన్నటువంటి నిరుపేద ముస్లిం కుటుంబాలను ఆదుకోవాలని చెప్పారు.

# కారు, బైకు ఢీ?ఒకరు మృతి

నూజివీడు వేగంగా వచ్చిన కారు బైక్ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన నూజివీడు పట్టణంలో నేడు చోటు చేసుకుంది. నూజివీడు పట్టణం పోతిరెడ్డిపల్లి రోడ్డులో ఊట వాగు వద్ద ప్రమాదం జరిగింది. ఘటనలు కారు యజమానికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆగిరిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన భార్యభర్తలు ఇద్దరూ బైక్ పై వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో భర్త బెక్కం నరేష్(23) అక్కడికక్కడే మృతి చెందారు. భార్యకు గాయాలు అయ్యాయి. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఆశాజనకంగా ఆయిల్ పామ్ ధరలు

ఏలూరు, మే 1, (న్యూస్ పల్స్)ఆయిల్‌పామ్ గెలల ధర టన్ను రూ.18 వేలకు పెరిగింది. రెండేళ్ల క్రితం టన్ను గెలలకు రూ.7,827 మాత్రమే లభించగా.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రెండేళ్లలోనే రూ.10 వేలకు పైగా పెరిగింది. ఆయిల్‌పామ్ తోటలను తొలగిస్తూ వచ్చిన రైతులు ధర ఆశాజనకంగా ఉండటం.. ప్రభుత్వ ప్రోత్సాహం పెరగడంతో తిరిగి పెద్దఎత్తున సాగు ప్రారంభిస్తున్నారు. ఫలితంగా రెండేళ్లలోనే రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు పెరిగింది.వైఎస్ జగన్ సర్కారు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడంతో రైతుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. 2018లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తూ పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరు వచ్చినప్పుడు ఆయిల్‌పామ్ రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆ సమయంలో తెలంగాణలో ఆయిల్‌పామ్ గెలల ధరకు, మన రాష్ట్రంలో పలికిన ధరకు మధ్య గల వ్యత్యాస సొమ్మును వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం 29,365 మంది రైతుల ఖాతాల్లో రూ.80.32 కోట్లను జమ చేశారు. వ్యత్యాస ధర చెల్లించడంతో పాటు ప్రభుత్వం ఆయిల్‌పామ్ గెలల ధరను అనూహ్యంగా పెంచింది. అడహక్ పేమెంట్‌గా టన్నుకు రూ.18 వేలు అందిస్తోంది. అదనంగా రవాణా నిమిత్తం మరో రూ.200 నుంచి రూ.400 వరకు రైతుకు లభిస్తోంది. మరోవైపు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ఆయిల్‌పామ్ రైతులకు మరింత ప్రయోజనాన్ని చేకూరుస్తోంది. దీంతో రెండేళ్ల క్రితం రాష్ట్రం 1.60 లక్షల హెక్టార్లకే పరిమితమైన సాగు విస్తీర్ణం 20 వేల హెక్టార్లు పెరిగి ప్రస్తుతం 1.80 లక్షల హెక్టార్లకు చేరుకుంది.ఆయిల్‌పామ్ గెలలకు గిట్టుబాటు ధర కల్పించాలని గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు ఆందోళనలు చేపట్టాం. కాలం వెళ్లబుచ్చారే గానీ ధర మాత్రం పెంచలేదు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్ ప్రభుత్వం టన్ను ధరను రూ.18 వేలకు పెంచింది. రైతు ప్రభుత్వమంటే ఇదీ.

ఆయిల్‌పామ్‌కు ఇది స్వర్ణయుగం. ఎన్నడూ లేనంతగా ఆయిల్‌పామ్ రైతులకు మంచి ధర వస్తోంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు చూపిస్తున్న చొరవ అమోఘం. ప్రభుత్వ రంగంలో ఉన్న అయిల్ ఫెడ్‌కు సహకరిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక టన్ను ధర రెట్టింపు కన్నా ఎక్కువ అయ్యింది. ఓఈఆర్ ఒక శాతం పెరిగితే టన్ను గెలలకు సుమారు రూ.1,190 వరకు అదనంగా ధర వస్తుంది. గత ఏడాది 15 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలల దిగుబడి రాగా.. ఈ ఏడాది 16 లక్షల టన్నులు రావొచ్చని అంచనా. ప్రస్తుత జీవో ప్రకారం ధర నిర్ణయిస్తే రైతులకు ఈ ఏడాది రూ.200 కోట్ల మేర అదనంగా ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం ఓఈఆర్ 17.6 శాతాన్ని బట్టి కంపెనీలు ధర నిర్ణయిస్తుండగా.. ఇకపై 18.682 శాతం ప్రకారం ఇవ్వాలి.

# అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

## జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు

అనంతపురం, మే 01 కరోనా నేపథ్యంలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ ఉ ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోవిడ్ 19 చికిత్స కోసం కొత్త ధరలను ప్రభుత్వం ప్రకటించిందని, జిల్లాలో నోటిఫై చేసిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోవిడ్ 19 చికిత్స కోసం ప్రభుత్వం నిర్ణయించిన ధరలనే వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్ 19 చికిత్స ను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందజేస్తారన్నారు. చాలా ప్రైవేటు ఆసుపత్రులు కోవిడ్ చికిత్సకు అధిక ధరలు వసూలు చేస్తున్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ ఉ ప్రైవేట్ హాస్పిటల్స్ లో కోవిడ్ చికిత్స కోసం ప్రభుత్వం గతంలో జారీచేసిన ఫీజులను సవరించి కొత్త ధరలను నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల్లో కన్సల్టెన్సీ, నర్సింగ్ ఛార్జీలు, గది అద్దె, భోజనం, కోవిడ్ పరీక్షల రుసుము, పీపీఈ కిట్లు, ఔషధాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను కాకుండా అధిక డబ్బులు వసూలు చేస్తే అలాంటి ప్రైవేట్ ఆస్పత్రుల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోవిడ్ చికిత్స కోసం ప్రభుత్వం ప్రకటించిన ధరలను జిల్లా కలెక్టర్ తెలిపారు.నాన్ క్రిటికల్ కోవిడ్ ట్రీట్మెంట్ కోసం ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 4,000˘రూపాయలు, నాన్ ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 3,600 రూపాయలు వసూలు చేయాలన్నారు. క్రిటికల్ కు సంబంధించి నాన్ క్రిటికల్ కోవిడ్ ట్రీట్మెంట్ విత్ 02 కోసం ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 6,500 రూపాయలు, నాన్ ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 5,850 రూపాయలు వసూలు చేయాలన్నారు. క్రిటికల్ కేర్ కు సంబంధించి క్రిటికల్ కేర్ ట్రీట్మెంట్ ఇన్ ఐసీయూ విత్ ఎన్ఐవి (సిపిఎపి, బిఐపిఎపి, హెచ్ఎఫ్ఎన్ఓ) కోసం ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 12,000 రూపాయలు, నాన్ ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 10,800 రూపాయలు వసూలు చేయాలన్నారు. క్రిటికల్ కేర్ కు సంబంధించి క్రిటికల్ కోవిడ్ ట్రీట్మెంట్ ఇన్ ఐసీయూ విత్ వెంటిలేటర్ ఆధారంగా చికిత్స కోసం ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 16,000 రూపాయలు, నాన్ ఎన్ఏబిహెచ్ ఆస్పత్రుల్లో ఒక రోజుకు 14,400 రూపాయలు వసూలు చేయాలన్నారు. అలాగే సిటీ స్కాన్ తీస్తే (ఫిల్మ్, రిపోర్ట్ తో కలిపి) 3,000 రూపాయలు వసూలు చేయాలన్నారు. రెమ్ డెసివిర్ ఇంజక్షన్ ఒకటి 2,500 రూపాయలు, టోసిలిజుమాబ్ కు 30,000 రూపాయలు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల పట్టికను నోటిఫై చేసిన అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరలకన్నా అధిక ధరలను వసూలు చేస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం, ఐపిసి యొక్క నిబంధనల ప్రకారం చర్యలు తప్పవన్నారు.. చికిత్స ఆధారంగానే ఫీజులు ఉండాలే తప్ప ప్యాకేజీల రూపంలో వసూళ్లకు పాల్పడ్డ కూడదని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేసిందన్నారు. జిల్లాలో నోటిఫై చేసిన కోవిడ్ ఆస్పత్రుల్లో కరోనా బాధితులను తప్పనిసరిగా అడ్మిట్ చేసుకోవాలన్నారు. అడ్వాన్స్ వసూలు చేయరాదని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# శ్రామిక జన సంఘీభావ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

## ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

నెల్లూరు శ్రామికజన సంఘీభావ చిహ్నంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటామని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అద్యక్షులు దమ్ము దర్గాబాబు అన్నారు. మండల కేంద్రమైన జలదంకి లో 135 వ మేడే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 వ శాతాబ్ధంలో పారిశ్రామిక విప్లవం అమెరికా, యు?రప్ దేశాలలో భారీ పరిశ్రమలు నెలకొల్ప పడ్డాయని ఆయా పరిశ్రమలలో పనిచేయుటకు , ఆసంఖ్యాకంగా కార్మికులు అవసరం ఏర్పడిందన్నారు .ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారులు, కార్మికులు రెండు వర్గాలుగా ఏర్పడ్డాయి అని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు శ్రామికులచే బానిసల్లా పనిచేయించి, అధిక లాభాలు గడించే యాజమానులు ఆడ వాళ్ళు, పిల్లలు అనే విచక్షణ లేకుండా కార్మాగారాల్లో గనుల్లో నియమితకాల వ్యవది లేకుండా గోడ్డు చాకిరి చేయించుకునే వారని ఆవేదన వ్యక్తపరిచారు. వారికి కనీస అవసరమైన తిండి, బట్ట నివాస వసతులు కల్పంచేవారు కాదని ఆరోపించారు. కార్మికులు రోజుకు 16 గంటల నుండి 20 గంటలు పనిచేయించే వారని, కార్మాగారాల్లో గాలి వెలుతురు ఉండేవి కాదన్నారు. శ్రమను మరచిపోవడానికి పాటలు పాడిన ,విశ్రాంతి తీసుకొన్న యాజమానుల దిక్కారం క్రింద జరిమాన విదించే వారు, ఆ సందర్భంలో 1886 మే 1 ఆమెరికా చికాగోలో హే మార్కెట్లో 8 గంటల పని దినం కోసం కార్మికులు 4 లక్షల మంది సమ్మెలో పాల్గొన్నారు. పోలీసులు వారిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారన్నారు. ఆప్రాంతమంతా కార్మికులు రక్తంతో తడిచిపోగా, ఎందరో అమరులయ్యారు ఆ హు?ంకారంతో దద్దరిల్లగా వారి నోట వెంట ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాధం శ్రామిక జన శంకరమై విశ్వ వ్యాప్తంగా మారుమైమెగింది. చికాగో ఆమర దీనంగా చరిత్రకెక్కందన్నారు. ఈ ఉద్యమం ప్రాదేశిక సరిహద్దులి దాటి ప్రపంచంలోనే అన్ని దేశాలకు విస్తరించి, చివరకి శ్రామిక విజయానికి చిహ్నంగా, రోజుకు 8 గంటల పని చట్ట చేయబడిందన్నారు. 1923 లో మె?ట్ట మె?దటి సారిగా భారతదేశం చెన్నై లొ మేడే జరపటం జరిగిందన్నారు. 1985 తురవాత గ్లోబలైజేషన్, ప్రవేటుజైషన్ లిబర్ లైజేషన్ వల్ల ఆ సంఘటిత కార్మిక వర్గాల చట్టాలు అమలుకునో చుకోవటం లేదు. కార్మికకు సాదించుకున్న హక్కులు మె?డి సర్కార్ లేబర్ కోడ్ బిల్లు రైతు వ్యతిరేక చట్టాలు కార్మిక హక్కులు కాలరాస్తున్నారు. కార్మిక చట్టాలు పుస్తకాలకే పరిమితమౌతున్నాయి. అచరణకకు నోచుకోవటం లేదు.

# జిల్లాలో కరోనా విలయతాండవం



## గ్రామాలు,పట్టణాలు తేడా లేకుండా విజృంభణ

గుంటూరు,మే1(ఆర్ఎన్ఎ): గుంటూరు జిల్లాలో కరోనా విలయం సృష్టిస్తోంది. అనేకులు కరోనాబారిన పడి మృత్యువాత పడుతున్నారు. ఇంటివద్దే ఉండి చికిత్స తీసుకుంటున్నా, ఆస్పత్రులకు వెళుతున్నా అదృష్టం ఉంటేనే బతుకుతున్నారు. కరోనా కాటుతో కుటుంబాలు కకావికలమవుతున్నాయి. ఒకవైపు ఆస్పత్రుల్లో బెడ్లు దొరక్క.. మరోవైపు ఆక్సిజన్ సక్రమంగా అందక.. ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ తట్టుకోలేక కరోనా బాధితులు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా కుటుంబాల్లో మరణాలు సంభవిస్తుండటంతో వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. కరోనా లక్షణాలతో చిలకలూరిపేటలో తల్లి, కుమారుడు రోజుల వ్యవధిలో బలయ్యారు. డ్వామా జిల్లా కార్యాలయంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్, యడ్లపాడు మండలం కొండవీడులో ఓ ఆటో డ్రైవర్, కొల్లూరు జీవీఎస్ఆర్ అండ్ ఎస్ఏఆర్ జూనియర్ కళాశాలలో ఓ అధ్యాపకుడు కరోనా లక్షణాలతో మృతి చెందారు. విద్యుత్ శాఖలో కరోనా ప్రమాద ఘంటికలు మోగిస్తూనే ఉన్నది. డ్వామా జిల్లా కార్యాలయంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ టి.విజయకుమార్(50) కరోనా లక్షణాలతో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. పది రోజుల నుంచి ఆయన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భార్య, ఓ కుమారుడు ప్రస్తుతం కరోనా లక్షణాలతో చికిత్స పొందుతున్నట్లు జడ్పీ సిబ్బంది చెప్పారు. ఒకే కుటుంబంలో రోజుల వ్యవధిలో రెండు మరణాలు సంభవించడంతో ఆ ప్రాంతంలో విషాదం అలుముకుంది. కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, జాలాది సుబ్బారావుల సమాచారంతో మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్ తీసుకుని వచ్చి వృద్ధురాలి మృతదేహాన్ని తరలించారు. 16వ వార్డుకు చెందిన ఓ యువకుడు(25) కరోనా లక్షణాలతో రాజస్థాన్‌లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు వాపోయారు. విద్యుత్ శాఖలో శుక్రవారం ముగ్గురు ఉ ద్యోగులు కరోనా లక్షణాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెనాలి డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్, గుంటూరు సర్కిల్, తెనాలి రెండో పట్టణ ఉపకేంద్రం లైన్‌మన్, దాసరిపాలెం షిఫ్టు ఆపరేటర్ కరోనా లక్షణాలతో మృతి చెందినట్లు ఆ శాఖ వర్గాలు సంతాపం తెలిపాయి. సుమారు నెల పాటు కొవిడ్‌తో పోరాడి తెనాలి ఈఈ, టౌన్-2 ఈఈలు శనివారం విధులకు హాజరు కాగా వారికి విద్యుత్ శాఖ ఉద్యోగులు స్వాగతం పలికారు. యడ్లపాడుమండలంలోని కొండవీడు గ్రామంలో ఓ ఆటో డ్రైవర్ కరోనా లక్షణాలతో మృతి చెందాడు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతడికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ఇంటి వద్దే ఉ ంటూ చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్యం విషమించి ఊపిరి ఆడక మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కొల్లూరు జీవీఎస్ఆర్ అండ్ ఎస్ఎఆర్ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడైన అంబేద్కర్(49) కరోనా లక్షణాలతో మృతి చెందారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# ప్రైమరీ, సెకండరీ కాంటాక్టుల మ్యాపింగ్ పూర్తి చేయండి

## 'కాంటాక్ట్ మ్యాపింగ్ లో ప్రతి రోజూ జీరో పెండెన్సీ లక్ష్యంగా పనిచేయాలి'

## - ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించిన జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు

అనంతపురం మే 01, జిల్లాలో కోవిడ్ బాధితుల ప్రైమరీ, సెకండరీ కాంటాక్టుల మ్యాపింగ్ అత్యవసరంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసులకు సంబంధించి ప్రైమరీ, సెకండరీ కాంటాక్టుల మ్యాపింగ్ పెండింగులో ఉందని, పెండింగ్ ను తీవ్రంగా పరిగణిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకూ పెండెన్సీలో ఉన్న కాంటాక్ట్ మ్యాపింగును మధ్యాహ్నం రెండు గంటల లోపు పూర్తి చేయాలని ఆర్డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కోవిడ్ పాజిటివ్ కేసును 10 ప్రైమరీ కాంటాక్టులు, 21 సెకండరీ కాంటాక్టులతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి మండలాలు, మునిసిపాలిటీలు, గ్రామ/వార్డు స్థాయి టీములతో సమన్వయ పరుచుకుని ఏరోజుకారోజు పెండెన్సీ లేకుండా చూడాలని ఇదివరకే అదేశాలిచ్చామన్నారు. పెండెన్సీ తగ్గించడంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నా ప్రతి రోజూ కొన్ని కేసుల మ్యాపింగ్ పెండింగ్ లో ఉ ంచడం వల్ల కోవిడ్ వ్యాప్తి మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు యుద్ధప్రాతిదికన పని చేసి జీరో పెండెన్సీ తీసుకురావాలన్నారు. కాంటాక్ట్ మ్యాపింగ్ విషయంలో ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలను మండల స్థాయి ఉద్యోగులు పట్టించుకోవడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. మండల స్థాయి అధికారులు మండల, మునిసిపల్, గ్రామ/వార్డు స్థాయిలో సరిగ్గా పని చేయకుండా వుంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.. కాంటాక్ట్ మ్యాపింగ్ చేయకుండా కోవిడ్ ను ఎదుర్కోవడం అసాధ్యమని, వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు

# గువ్వలదొడ్డి గ్రామంలో విద్యార్థులకు కరోనా పై అవగాహన కార్యక్రమం

ఎమ్మిగనూరు ,మండల పరిధిలోని , గువ్వల దొడ్డి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు రాష్ట్ర సిఆర్ఫ్ఫ్ ఆదేశాల మేరకు జిల్లా సిఆర్ఫ్ఫ్ కన్వీనర్ ఈ లింగన్న ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని దేశాల కంటే దేశంలో కరోనా సెకండ్ వేవ్ 2,ఎక్కువగా ప్రభావంతంగా ఉందని, దాని వలన విద్యార్థిని,విద్యార్థులు సెకండ్ వేవ్ కరోనా 2పై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యముగా ఇంట్లో ఉన్న,బయటకు వచ్చిన తప్పనిసరిగా ముఖానికి మాస్కులుధరించాలని,చేతులకు శానిటైజర్ గాని, సబ్బు గాని వాడాలని,సామాజిక దూరము పాటించాలని తెలిపారు. అనంతరం సిఆర్పి ఎఫ్ సభ్యులు మరియు ఆరోగ్య కార్యకర్త బేబీ మేడమ్ పాల్గొని కరోనా పట్ల ముందు జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లింగన్న మాట్లాడుతూ కరోనా గురించి భయపడవలసిన అవసరం లేదు అని 18 సం, రం లు వయసు పైబడిన వారికి కూడా కరోన వ్యాక్సిన్ ఉచితంగా వేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామం అని,ప్రభుత్వం ఉత్తర్వులు రాగానే ఆకార్యక్రమం మొదలవుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బి.లింగమ్మ ,మహిళా కో కన్వీనర్ ఎం శ్రీదేవి ,జిల్లా కో కన్వీనర్ శేఖర్ ,ప్రధాన కార్యదర్శి జనరల్ సెక్రటరీ ఎం జయరాజు, కార్యదర్శి నల్లన్న,కార్యదర్శి రాజు విద్యార్థిని విద్యార్థులు సిఆర్పిఎఫ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఓసీపీ 4 వద్ద మేడే ఉత్సవాలు

గోదావరిఖని శ్రమదోపిడికి వ్యతిరేకంగా 8గంటల పనివిధానం అమలు చేయాలంటూ కార్మికులు, ఉద్యోగులు పోరాడి విజయం సాధించిన రోజే మేడే అని, తెలంగాణ రాష్ట్రంలోని కార్మిక వర్గాన్ని సిఎం కేసీఆర్ కంటికిరెప్పాలగా కపాడుతున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శనివారం ఓ.సి.పి. 4వద్ద జెండాను ఎగురవేసి కార్మికులకు ఎమ్మెల్యే మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.1886 సంవత్సరం మే 1వ తేదిన అమెరికలో కార్మికులతో పెట్టుబడిదారులు 15గంటల పనివిధానాన్ని అమలు చేయాడాన్ని కార్మికుల నిరసన ప్రదర్శన చేపట్టారన్నారు. అనాడు చికాగో నగరంలో వెట్టిచాకరి విధానానికి బానిస పరిపాలన వ్యతిరేకంగా కార్మికవర్గమంతా సాగించిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో వందలాది మంది కార్మికుల మృతి చెందారని వారి త్యాగ ఫలితంగానే 8గంటల పని విధానం అమల్లోకి రావడం జరిగిందని, ఈ రోజునే ప్రపంచ కార్మిక దినంగా జరుపుకుంటారని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సందర్భంలో జరిగిన సకలజనుల సమ్మెలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమన్నారు. నాటి ఉద్యమనేత సిఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సకలజనుల సమ్మె చేపట్టడం జరిగిందని, సకలజనుల సమ్మెను విచ్చినం చేయాడానికి ఆనాడు ఈ ఓసిపిలో రాత్రిపూట పనులు జరిపించేందుకు జరిగిన కుట్రలను తాము స్వయంగా తిప్పికొట్టడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కార్మికులంతా ఐక్యం ఒకతాటిపై ఉండాలని, ఐక్యతతో పోరాడితేనే సమస్యలు పరిష్కరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బంగీ అనిల్ కుమార్, టిబిజికెఎస్ నాయకులు గండ్రదామోదర్ రావు, జహీద్ పాషా, కనకం శ్యాంసన్, పుట్ట రమేష్, గంగధర్, శేషగిరి, రాంచెందర్, శ్రీనివాసరావు, జనగామ శ్రీనివాస్, సత్యనారాయణ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆక్సిజన్ కంటైనర్లకోసం నావికాదళ సేవలు

విశాఖపట్నం దేశాన్ని కుదిపేస్తున్న ఆక్సిజన్ సమస్య పరిష్కారం కోసం ఇండియన్ నేవీ ముందుకు వచ్చింది.ఆక్సిజన్ అవస రాలను తీర్చడానికి కొనసాగుతున్న జాతీయ మిషన్ను పెంచడానికి భారత నావికాదళం ఆపరేషన్ సముద్ర సేతు -2 ను ప్రారంభించింది. ఆక్సిజన్ నిండిన క్రయోజెనిక్ కంటైనర్లు అనుబంధ వైద్య పరికరాలను భారతదేశానికి తీసుకెళ్లడానికి యుద్ధ నౌకలను నియమించారు. దేశవ్యా ప్తంగా విమానంలో తీసుకువెళ్ళే కంటైనర్లన్నీ ఖాళీగా ఉన్న వాటిలో ఆక్సిజన్ నిండిన ట్యాంకులను నావికాదళ ఆపరేషన్ ద్వారా గమ్య స్థానానికి తరలిస్తున్నారు.ఐఎన్ఎస్ కోల్కతా, ఐఎన్ఎస్ తల్వార్ అనే రెండు నౌకలు 40 టన్నుల ద్రవ ఆక్సిజన్ను ముంబైకి తీసుకెళ్లాయి. గత సంవత్సరం, భారత నావికాదళం వందే భారత్ మిషన్లో భాగంగా ఆపరేషన్ సముద్ర సేతును ప్రారంభించింది, మాల్దీవులు, శ్రీలంక మరియు ఇరాన్ నుండి సుమారు 4,000 మంది ఒంటరిగా మరియు బాధపడుతున్న భారత పౌరులను స్వదేశానికి తిరిగి పంపించింది.మళ్ళీ ఇప్పుడు ఆక్సిజన్ తరలించదంలోను ప్రముఖ పాత్రను పోషిస్తోంది.

# 16 లక్షల మాస్కులు ఉచిత పంపిణీ

తిరుపతి, ( విభారె) కరోనా విలయతాండవం చేస్తున్న క్రమంలో.. ఆ మహమ్మారి ప్రజల ధరి చేరకుండా అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన 16 లక్షల మాస్కులను ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వ విప్, తుడా చైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న 1 లక్ష 60 వేల కుటుంబాలకు.. ఒక్కో ఇంటికి 10 మాస్కుల చొప్పున ఉచితంగా అందించనున్నారు. తిరుపతి రూరల్ మండలం ఎంపిడిఓ కార్యాలయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన 16 లక్షల మాస్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి విచ్చేశారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు మండలాల ఎంపిడిఓ, తహశీల్దార్లకు మాస్కులను అందజేశారు.ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తు న్న ప్రజలకు బాసటగా నిలుస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇతర ప్రజా ప్రతినిధులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుండటం అభినందనీయమ న్నారు.కరోనా కష్ట కాలంలో ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలిచి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వ విప్, తుడా చైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుండటం అభినందనీయం.. చెవిరెడ్డి

**ఇంటింటికి 10 చొప్పున..**
**1 లక్ష 60 వేల ఇళ్ళకు పంపిణీ**
**విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడం అభినందనీయం**
**చెవిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం**
**టీటీడీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి**
**ప్రజల బాగోగులు చూసుకోవడం శాసన సభ్యుడిగా నా బాధ్యత**
**ఎమ్మెల్యే చెవిరెడ్డి**

ఆధ్వర్యంలో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం.. సర్జికల్ మాస్కుల పంపిణీ గొప్ప పరిణామం.. ప్రజల భద్రత, ప్రాణాలు కాపాడుకోవ దం చెవిరెడ్డి స్ఫూర్తితో ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి బాధ్యత గా భావించాలని కోరారు.కరోనా సమయంలో ప్రతి కుటుంబంలో ప్రతి సభ్యుడు మాస్క్ తప్పనిసరిగా ధరించాలి.. భౌతిక దూరం పాటించాలి, శానిటైజర్ వినియోగించాలని సూచించారు. ఈ మూడు తప్పనిసరి పాటించాలన్నారు.

# ఎల్జీ పాలిమర్స్ మూసేయండి

విశాఖపట్టణం, మే 1, ( విభారె) విశాఖపట్నంలోని ఎల్జీ పాలీమర్స్ సంస్థలో ఉత్పత్తులు, ముడిసరకు విక్రయాలకు సంబంధించిన మొత్తాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ వద్ద జమ చేయాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఎల్జీ పాలీమర్స్‌లో గతేడాది మే 7న విష వాయువు విడుదలై పలువురు మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న ఈ పరిశ్రమను మూసివేయాలని ఆదేశించింది.ఈ కేసులో భాగంగా ఎల్జీ పాలీమర్స్ సంస్థలో ఉత్పత్తులు, యంత్రాలను విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ వద్ద జమ చేయాలని తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఎల్జీ పాలీమర్స్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ కె.ఎం.జోసఫ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.పరిశ్రమ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. మృతులు, బాధితుల కుటుంబాలకు ఇప్పటికే రూ.37.10 కోట్ల పరిహారం చెల్లించామని తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం రూ.50 కోట్లు డిపాజిట్ చేశామని వివరించారు.ఉత్పత్తులు, ముడిసరకు విక్రయంతో వచ్చిన సొమ్మును కలెక్టర్ వద్ద జమ చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, ఇతర సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టులో అమికస్ క్యూరీగా వైవీ రవిప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మహఫూజ్ నజ్కీకి తెలియజేయాలని రోహత్గీకి సూచించింది.గతేడాది ప్రమాదం తర్వాత పరిశ్రమలో కార్యకలాపాలను నిలుపుదల చేశారు. సంచలనం సృష్టించిన ఎల్జీ పాలిమర్స్ ఘటనకు కారకులుగా పేర్కొంటూ 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కంపెనీలో సామగ్రి, యంత్రాల విక్రయానికి అనుమతి కోరుతూ ఎల్జీ పాలిమర్స్ హైకోర్టులో పిటిషన్ వేసింది.దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే గోస్వామి, జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం విచారించింది. కంపెనీలో సామగ్రి అమ్మకానికి అనుమతించిన ధర్మాసనం.. యంత్రాలు అమ్మితే వచ్చిన మొత్తాన్ని డిపాజిట్ చేయాలని ఆదేశించింది. విశాఖ జిల్లా కలెక్టర్ వద్ద డబ్బును జమ చేయాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తుది తీర్పు మేరకునడుచుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

## ఏసీబీ కస్టడీకి ధూళిపాళ

రాజమండ్రి, మే 1,( విభారె) సంగం డెయిరీలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత ధూళఇపాళ్ల నరేంద్రనుఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఆయనను తరలించారు. ధూళిపాళ్లను ఐదు రోజులపాటు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ న్యాయస్థానం ఐదు రోజుల కస్టడీకి అనుమతించడంతో రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. ధూళిపాళ్లతో పాటు సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్, సహకార శాఖ మాజీ అధికారి గురునాథాన్ని కూడా తీసుకెళ్లారు.వీరిని ఈ నెల 5 వరకు విచారించేందుకు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అనుమతిచ్చింది. ఏసీబీ కస్టడీలో ఉన్న తన తండ్రిని చూసేందుకు వచ్చిన ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె కన్నీరు మున్నీరైంది. కారు అద్దం తీయమని పోలీసులను బతిమలాడింది. తండ్రిని తీసుకెళ్తున్న కారు వెంట ఆమె ఆతృతగా బయలుదేరి వెళ్లింది. ఆమె ఆవేదన అక్కడ ఉన్నవారిని కంటతడిపెట్టించింది. కాగా, తన రిమాండ్‌ను సవాల్ చేస్తూ నరేంద్ర కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఏసీబీ కేసును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను మాత్రం విచారణకు స్వీకరించింది.ధూళిపాళ్ల నరేంద్రను అరెస్ట్ చేసిన వెంటనే సంగం డెయిరీ యాజమాన్యాన్ని గుంటూరు జిల్లా పాల ఉత్పత్తి దారుల సహకార సంఘానికి ప్రభుత్వం బదిలీ చేశారు. సంగం డెయిరీ యాజమాన్య హక్కులు మారుస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. సంగం డెయిరీ రోజువారీ కార్యకలపాల బాధ్యత తెనాలి సబ్ కలెక్టర్‌కు అప్పగించింది. అయితే, డెయిరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ పరిధిలోకి డెయిరీని తీసుకొస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 19కి వ్యతిరేకంగా డెయిరీ డైరెక్టర్లు పిటిషన్ దాఖలు చేశారు.

# ఈ విటమిన్ సీ పండ్లు తినండి.. రోగనిరోధక శక్తి పెంచుకోండి..!



రోగనిరోధక వ్యవస్థ.. మన శరీరంలో ఉండి మనకు వ్యాధులు రాకుండా కాపాడుతూ.. ఒకవేళ వచ్చినా వాటిని సమర్థంగా పోరాడి పారదోలే యంత్రాంగం ఇది. సాధారణంగా పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ రోగనిరోధకశక్తి ఎక్కువగా ఉంటుంది. అయితే నేటి జీవన విధానం, అలవాట్లు కొన్ని దాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. మన చుట్టూ నిరంతరం బోలెడన్ని హానికారక సూక్ష్మక్రిములు తిరుగుతుంటాయి. ఎప్పుడైనా వాటి బారినపడే ప్రమాదముంది. దీంతో రకరకాల ఇన్‌ఫెక్షన్లు, జబ్బులు దాడిచేస్తాయి. అయితే మనలో రోగనిరోధక శక్తి బలంగా ఉందనుకోండి. అవేమీ చేయలేవు.
రోజూ మనం తీసుకునే ఆహారంలో సరైన పోషకాలు ఉండేలా చూసుకుంటే, మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా ఎన్నో వ్యాధులను తరిమి కొట్టవచ్చునని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. మనలో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) మెరుగ్గా ఉంటే పలు వైరస్‌లు, వ్యాధులను కూడా సమర్థంగా ఎదుర్కొనే వీలుంటుందని పోషకాహార నిపుణులు అంటున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచడంలో ఎ, ఇ, డి, సి, బి విటమిన్లు, జింక్, సెలీనియం, ఐరన్, కాపర్ తదితర ఖనిజాలు, ఫైటోన్యూట్రియెంట్స్, అమైనో ఆమ్లాలు, ఫ్యాటీ ఆమ్లాలు కీలక పాత్ర పోషిస్తాయి.సిట్రస్ జాతి పండ్లలో రోగనిరోధక శక్తిని పెంచే బూస్టర్లు ఉంటాయి. ఈ రకం పండ్లలో ఉండే విటమిన్ సీ లేదా ఆస్కార్బిక్ ఆసిడ్ మన శరీరంలో వ్యాధినిరోధకతను పెంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. శరీరంలో ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడటంతోపాటు కణజాలం మరమ్మతులో ముఖ్య పాత్ర పోషిస్తుంది. నిత్యం వీటిని సరైన మోతాదులో తీసుకోవడం ద్వారా ఎన్నో నొప్పులను నయం చేసుకునే వీలుంటుంది. అలాగే, ఎముకలను కూడా బలంగా తయారుచేసుకోవచ్చు.ఆమ్లా లేదా ఇండియన్ గూస్బెర్రీగా పిలుచుకును ఉసిరి మన శరీరానికి అందించే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. శతాబ్దాలుగా వివిధ ఆరోగ్య వ్యాధుల చికిత్స కోసం వీటిని ఉపయోగిస్తున్నారు. నారింజలో కన్నా వీటిలో 20 రెట్లు ఎక్కువ విటమిన్ సీ ఉంటుంది. విటమిన్ సీ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. నాడీ వ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థ, చర్మానికి మేలు చేస్తుంది. ఇది కాకుండా, జీవక్రియ, ఎముకల నిర్మాణం, పునరుత్పత్తి, రోగనిరోధక ప్రతిస్పందనను పెంచడానికి ఉసిరి సహాయపడుతుంది. ఆమ్లా జ్యూస్ లేదా రోజూ ఉదయం ఒక పండు తినడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందిచుకోవచ్చు.నారింజ ఎన్నో విధాలుగా మన ఆరోగ్యానికి ఉపయోగపడే సిట్రస్ జాతి పండు. వీటిని వివిధ రకాలుగా ఆహారంలో చేర్చుకోవచ్చు. మీడియం సైజ్ ఆరెంజ్ లో 53.2 మి.గ్రా విటమిన్ సీ ఉంటుంది. వీటిలోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు మన రోగనిరోధక ఆరోగ్యాన్ని పెంచడానికి, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి మన కణాలను రక్షించడానికి సహాయపడతాయి. జలుబు, ఇతర అలెర్జీలతో బాధపడుతున్న వారికి నారింజ ఎంతో మంచిది. ఈ పండు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి.. ఒత్తిడి హార్మోన్ స్థాయిలను తగ్గిస్తుంది.మన రోగనిరోధక ఆరోగ్యాన్ని పెంచేటప్పుడు కూరగాయలను తరచుగా విస్మరిస్తాం. అయితే ఆశ్చర్యకరంగా బెల్ పెప్పర్‌లో సిట్రిక్ పండ్లతో సమానంగా విటమిన్ సీ ఉంటుంది. ఈ కూరగాయల్లో బీటా కెరోటిన్ కూడా పుష్కలంగా ఉంటుంది. బెల్ పెప్పర్‌లో ఉండే ఖనిజాలు, విటమిన్లు శరీరం యొక్క సహజ రక్షణ వ్యవస్థను నిర్మించడానికి.. చర్మ నాణ్యతను మెరుగుపరచడానికి, కళ్ళను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని తరచుగా బలహీనపరిచే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కూడా ఇవి సహాయపడుతాయి.విటమిన్ సీ, ఇతర యాంటీఆక్సిడెంట్ల సాధారణంగా లభించే వనరుల్లో నిమ్మకాయ ఒకటి. ఇది విదేశీ వ్యాధికారకాలతో పోరాడటానికి, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్లు శరీరానికి కణాలను దెబ్బతీసే, దీర్ఘకాలిక ఇన్‌ఫెక్షన్ కలిగించే ఫ్రీ రాడికల్స్ తొలగించడానికి సహాయపడతాయి. వీటిలో గణనీయమైన మొత్తంలో థయామిన్, రిబోఫ్లేవిన్, విటమిన్ బీ -6, పాంతోతేనిక్ ఆమ్లం, రాగి, మాంగనీస్ ఉన్నాయి.జీర్ణక్రియ, మంట సమస్యలకు చికిత్స చేయడానికి పైనాపిల్ శతాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. ఈ పండ్లలో విటమిన్ సీ, మాంగనీస్ అధికంగా ఉంటాయి. వీటిలో కేలరీలు తక్కువగా ఉండి.. ఫైబర్, బ్రోమెలైన్ అధికంగా ఉంటుంది. రోజూ పైనాపిల్ తినడం వలన వైరల్, బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం తగ్గుతుంది.

## హర్‌ప్రీత్ బ్రార్ భుజం తట్టిన కోహ్లి.. నెటిజన్లు ఫిదా

అహ్మదాబాద్: ఒక్క మ్యాచ్‌తో క్రీడా వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారిపోయాడు పంజాబ్ కింగ్స్ బౌలర్ హర్‌ప్రీత్ బ్రార్. శుక్రవారం రాయల్ చాలెంజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించిన సంగతి తెలిసిందే. తన స్పిన్నింగ్ మాయాజాలంతో ఆర్సీబీ కెప్టెన్ విరాట్ కోహ్లి(35), స్టార్ హిట్టర్లు గ్లెన్ మాక్స్‌వెల్(0), ఏబీ డివిలియర్స్(3)ను పెవిలియన్‌కు పంపి పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. తద్వారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవడంతో పాటు ఐపీఎల్‌లో తొలి వికెట్‌గా కోహ్లిని అవుట్ చేయడం ద్వారా ఈ మ్యాచ్‌ను మరింత మెమరబుల్‌గా మార్చుకున్నాడు.ఈ క్రమంలో మ్యాచ్ ముగిసిన తర్వాత హర్‌ప్రీత్ బ్రార్‌ను విరాట్ కోహ్లి ప్రత్యేకంగా అభినందించాడు. నవ్వుతూ కరచాలనం చేసి అతడి భుజం తట్టి ప్రోత్సహించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఐపీఎల్ ట్విటర్‌లో షేర్ చేసింది. “తొలి వికెట్.. పైగా అతడి నుంచి ప్రశంసలు.. బ్రార్‌కు ఇది కచ్చితంగా గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం అవుతుందివవ అంటూ కామెంట్ జతచేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో కోహ్లి ఫ్యాన్స్‌తో పాటు పంజాబ్ అభిమానులు కూడా రన్‌మెషీన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.




‘‘లెజెండ్స్ ఇలాగే యువ ఆటగాళ్లను ప్రోత్సహిస్తారు. క్రీడాస్ఫూర్తి అంటే ఇదే. అద్భుతమైన బౌలింగ్‌తో తనను అవుట్ చేసిన యువ బౌలర్‌ను అభినందించడం ద్వారా కోహ్లి మరోసారి మా మనసులు గెల్చుకున్నాడు. బెస్ట్ కెప్టెన్ నువ్వువవ అంటూ కామెంట్లు చేస్తున్నారు. అదే విధంగా, హర్‌ప్రీత్ బ్రార్‌ను కూడా ఆల్ ది బెస్ట్ అంటూ విషెస్ చెబుతున్నారు.


# గోవా బ్యూటీ ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉందా?



గోవా బ్యూటీ ఇలియానా టాలీవుడ్ లో ఒక వెలుగు వెలిగింది. చిన్న హీరోల నుండి స్టార్ హీరోల వరకు ఎంతో మందితో కలిసి నటించిన ఇలియానా టాలీవుడ్ లో మొదటి కోటి రూపాయలు తీసుకున్న హీరోయిన్ గా కూడా క్రెడిట్ దక్కించుకున్న విషయం తెల్సిందే. టాలీవుడ్ లో వరుసగా ఆఫర్లు వస్తున్న సమయంలోనే ఈ అమ్మడికి బాలీవుడ్ నుండి పిలుపు రావడంతో అక్కడికి వెళ్లింది. అక్కడ సుదీర్ఘ కాలం పాటు హీరోయిన్ గా ఈమె కొనసాగలేక పోయింది. అక్కడ ఈ అమ్మడి హవా కొంత కాలం మాత్రమే కొనసాగింది. ప్రస్తుతం బాలీవుడ్ లో ఒకటి రెండు చిన్న సినిమాల్లో నటిస్తుంది. ఇదే సమయంలో టాలీవుడ్ లేదా కోలీవుడ్ నుండి ఆఫర్ల కోసం ఎదురు చూస్తోంది.టాలీవుడ్ లో ఈమె రవితేజతో కలిసి అమర్ అక్బర్ ఆంటోనీ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో పాటు ఆ సినిమాలో ఇలియానా లుక్ పై విమర్శలు వచ్చాయి. ఇలియానా లావు అయ్యిందంటూ కామెంట్స్ వచ్చాయి. టాలీవుడ్ లో ఆఫర్ల కోసం ఈ అమ్మడు సన్నబడింది. కాని ఆఫర్లు మాత్రం కనిపించడం లేదు. తెలుగులో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న ఈ అమ్మడికి ఆఫర్లు మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు.ప్రియుడితో బ్రేకప్ తర్వాత ఈమె సినిమాల్లో బిజీ అవ్వాలని ప్రయత్నిస్తున్నా కూడా ఆఫర్లు మాత్రం కనిపించడం లేదు. ఈమె సోషల్ మీడియాలో హాట్ ఫొటోలను షేర్ చేయడంతో పాటు తనకు పరిచయం ఉన్న వారితో మాట్లాడుతూ ఆఫర్లను అడుగుతున్నట్లుగా తెలుస్తోంది. మొత్తానికి రీ ఎంట్రీ కోసం ఈ అమ్మడు తీవ్ర ప్రయత్నాలు అయితే చేస్తోంది. మరి అవి ఎంత వరకు వర్కౌట్ అవుతాయి అనేది చూడాలి.

# మెగాస్టార్ జోడీగా ఛాన్సులు వచ్చినా చేయలేకపోయిందట!

తెలుగు తెరకి పూతరేకులంటి నాజూకు సౌందర్యాన్ని పరిచయం చేసిన నిన్నటితరం కథానాయికలలో గౌతమి ఒకరుగా కనిపిస్తారు. అప్పట్లో చాలామంది హీరోయిన్లు తెరపై రాజ్యం చేస్తున్నప్పటికీ గౌతమి అందం ప్రత్యేకం అన్నట్టుగానే ఉండేవారు. మోడ్రన్ డ్రెస్సులు వేసినా .. చీరకట్టులోనూ అందమంటే ఇదేనని అనిపించుకున్నారు. నిజం చెప్పాలంటే చీరకట్టులోనే ఆమె ఎక్కువ మార్కులు కొట్టేసేవారు. తెలుగు తెరపై గౌతమిని చూస్తే అందానికే అక్కసు పుడుతుందేమోనని అనిపించేలా కనిపించేవారు.తెలుగులో వెంకటేశ్ జోడీగా cశ్రీనివాస కల్యాణంc చేసిన గౌతమికి ఆ తరువాత వరుసగా అనేక సినిమాల్లో అవకాశం వచ్చింది. అయితే తమిళ సినిమాలతో బిజీ కావడం వలన తెలుగు అభిమానులు కోరుకున్న స్థాయిలో ఇక్కడ ఎక్కువ సినిమాలు చేయలేకపోయారు. తమిళంలో తొలి సినిమానే రజనీకాంత్ సరసన చేసిన ఆమె ఆ తరువాత నుంచి అక్కడ కెరియర్ పరంగా వెనుదిరిగి చూసుకోలేదు. తారాజువ్వ మాదిరిగా అక్కడ ఆమె దూసుకుపోయారు. చాలా తక్కువకాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ .. ccతెలుగులో చిరంజీవిగారి సినిమాల్లో చేసే అవకాశం కూడా రెండు మూడుసార్లు వచ్చింది. ఆ సినిమాల పేర్లేమిటి అనే విషయం నేను చెప్పనుగానీ అవి నేను చేయలేకపోయాను. చిరంజీవిగారి సినిమా నుంచి ఎప్పుడు అవకాశం వచ్చినా ఆ సమయంలో తమిళంలో రజనీకాంత్ గారి సినిమా షూటింగులో ఉండేదానిని. అందువలన చిరంజీవిగారి సినిమా చేయలేకపోయేదానిని. అలా



అప్పుడు అవకాశం కుదరకపోవడం ఇప్పటికీ బాధ కలిగిస్తూనే ఉంటుందిcc అని చెప్పుకొచ్చారు.

# స్వీటీ శెట్టి సినిమాపై దృష్టి పెట్టిన నవీన్ పోలిశెట్టి..!

cఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయc సినిమాతో హీరోగా మారిన టాలెంటెడ్ యాక్టర్ నవీన్ పోలిశెట్టి.. ఫస్ట్ సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్నాడు. ఈ క్రమంలో cచిచోరెc సినిమాతో బాలీవుడ్ లో కూడా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక ఇటీవల వచ్చిన cజాతిరత్నాలుc సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యాడు. ఎన్నో లెక్కలు చూసుకొని ఆచి తూచి అడుగులు వేస్తున్న నవీన్.. ఇప్పుడు తన కాన్సన్ట్రేషన్ మొత్తం అనుష్క సినిమా మీద పెట్టినట్లు తెలుస్తోంది.దక్షిణాది అగ్ర కథానాయిక అనుష్క - నవీన్ పోలిశెట్టి కాంబినేషన్ లో ఓ సినిమా తెరకెక్కనుందని ఈ మధ్య వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. cరా రా కృష్ణయ్యc ఫేమ్ మహేష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. వాస్తవానికి ఏప్రిల్ 19 నుంచి ఈ సినిమాని సెట్స్ పైకి తీసుకెళ్లాలని ప్లాన్ చేయగా.. కరోనా నేపథ్యంలో స్టార్ట్ కాలేదని తెలుస్తోంది. పరిస్థితులు అనుకుంటున్నట్లుగా సద్దుమణిగితే ఈ ప్రాజెక్ట్ జూన్ లో పట్టాలెక్కే అవకాశం ఉందని అంటున్నారు.ఇకపోతే నవీన్ పోలిశెట్టి cజాతిరత్నాలుc సినిమా కంటే ముందే అనుష్క తో చేయబోయే సినిమాకు సైన్ చేశాడట. ఇదో మలయాళ సినిమా రీమేక్ అని అంటున్నారు. 20 ప్లస్



వయసున్న కుర్రాడితో 40 ప్లస్ లో ఉన్న మహిళ ప్రేమలో పడితే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్ తో ఈ రొమాంటిక్ డ్రామా రూపొందనుందని టాక్. ఇదే కనుక నిజమైతే తనకంటే వయసులో పెద్దదైన అనుష్క తో నవీన్ ఎలా నటిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# పెళ్లైన మహిళతో పొందు కోసం ప్రియదర్శి తిప్పలు



డిఫరెంట్ కంటెంట్ లేకపోతే ఓటీటిలలో వర్కవుట్ కావటంలేదు. ముఖ్యంగా మన తెలుగువాళ్లు చూసే వెబ్ సీరిస్ లు గమనిస్తే ఈ విషయం అర్దమవుతుంది. క్రైమ్ లేదా శృంగారం వీటికే ప్రయారిటీ ఇస్తున్నారు. డైరక్ట్ గానో లేక అండర్ కరెంట్ గానో ఈ కంటెంట్ అంతర్లీనంగా ప్రవహిస్తూనే ఉండాలి. ఇదిగో ఇప్పుడు ప్రియదర్శితో చేస్తున్న వెబ్ సీరిస్ కూడా అలాంటిదే.తెలుగులో వరస ఆఫర్స్ తో దూసుకుపోతున్న కమిడియన్ ప్రియదర్శి. లూజర్ వెబ్ సీరిస్ తో డిజిటల్ ఎంట్రీ ఇచ్చిన ఆయన మరోసారి ఓటీటి ప్లాట్ ఫామ్ లో కనపడబోతున్నారు. ఇన్ ద నేమ్ ఆఫ్ గాడ్ అనే టైటిల్ తో ఆహాలో ఓ వెబ్ సీరిస్ చేసారు. మే 21 నుంచి ఈ వెబ్ సీరిస్ ప్రీమియర్ కానుంది. ఇందులో పోసాని కృష్ణమురళి కూడా కీలకమైన పాత్రలో కనిపించనున్నారు.నందినీరాయ్ పాత్ర ఓ పెళ్లైన మహిళ. ఆమె తన భర్తని చంపేస్తుంది. అందుకు ప్రియదర్శి సాయిం చేస్తాడు. చంపబడ్డ భర్త శవం మాయం చేయటానికి జీప్ ని డ్రైవ్ చేయటానికి ఒప్పుకుంటాడు. అతని కోరిక ఏమిటంటే..ఆమెతో పడుకోవటం. అయితే అనుకున్నది అనుకున్నట్లు జరగదు. మధ్యలో రకరకాల సమస్యలు వస్తాయి. ఈ క్రమంలో ప్రియదర్శి పడే తిప్పలు సీరియస్ గా ఉన్నా నవ్విస్తాయంటున్నారు. చాలా కొత్తగా కనిపించే ఈ వెబ్ సీరిస్ పై మంచి ఎక్సపెక్టేషన్స్ ఉన్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**